# వక్ర రేఖలు

"డియర్ భారతీ!

మాంఛి కబురు చెబుతాను! కోపగించుకుంటావని నాకు తెలుసు! ఏం చెయ్యను మరి? నా పెళ్ళి నీకు కూడా తెలియనంతటి రహస్యంగా జరగవలసివచ్చిందని నాకూ బాధగానే ఉంది! నీకేమిటి? మా పెళ్ళి అయ్యే అంతవరకు, మా అమ్మ, నాన్న, అన్నయ్య, వదినలకు కూడా తెలీదనుకో! ఇంతకీ వరుడు...అదే మా శ్రీవారు, ఎవరనుకుంటున్నావ్? నీకు గుర్తుందా? నీ పెళ్ళికిముందు, అదేలే...మనం స్కూల్ ఫైనల్ పాసైన కొత్తలో, మా ఇంటి మేడమీద గదిలో అద్దెకు దిగాడూ? చంద్రశేఖరం...ఇక్కడే గుమస్తాగా పని చేస్తున్నాడు. పూర్తిగా బెంగాలీ బాబులా ఉంటాడు...గుర్తు వచ్చిందా? అతగాడె!

సరే, ఇక ఎందుకలా రహస్యంగా చేసుకున్నానంటావా? నీకు తెలుసుగదా? మా అమ్మ, నాన్నల మనస్తత్వం! కులాల, మతాల పట్టింపులు, చాదస్తాలు అసలే ఎక్కువ గల కుటుంబం మాది! దానికి తగ్గట్లుగానే శేఖర్ అన్యకులస్తుడయిపోయె! మా ఇద్దరి ప్రేమవ్యవహారం గుట్టుగానేఉంచుదామనుకున్నాం! కాని లాభం లేకపోయింది! ఒక రోజు

అన్నయ్యా కంటబడ్డాం! చేసేదిలేక వెల్లడించాను. పోనీ, నువ్వే చెప్పు భారతీ! నేనేం పసిపిల్లనా? నా జీవిత భాగస్వామిని ఎన్నుకునే స్వాతంత్ర్యము, వివేకము నాకు లేవు? అందము, చదువు, తెలివి తేటలు, సంస్కారము అన్నీ వున్న చంద్రశేఖర్‌ని నేను ప్రేమించడము, అతన్ని వివాహం చేసుకోవాలనుకోడము ఏం తప్పు? ఈ మాత్రపు దానికీ కులాల చీకటి తెర లెందుకు?

కాని, మా అన్నయ్యా, అమ్మ, నాన్న, ఒకటే ఘోష! అతగాణ్ణి తక్షణం రూం ఖాళీ చేయించేంత వరకు నిద్రపోలేదు! మనిషిని దూరం చెయ్యగలరు గాని, మనసును, మమతను దూరం చెయ్యగలరా ఎవరేనా?

చంద్రశేఖర్ కూడా నన్ను వదిలి క్షణం ఉండలేని స్థితికి వచ్చేశాడు. ఎలాగైతేనేం, పద్మవ్యూహంలాంటి కట్టుబాట్లు తప్పించుకుని, పార్కులో కలుసుకుని తిన్నగా నేను, చంద్రశేఖర్ రిజిష్టర్ మేరేజ్ చేసేసుకున్నాం. కనీసం, ఆశీర్వదించడమైనా చేస్తారేమోనని మా ఇంటికి వచ్చాం!

"నీతో సర్వసంబంధాలు తెంచుకున్నాం! ఇక ఈ గడప తొక్కవద్దు!" అంటూ స్పష్టంగా ముక్తకంఠాలతో చెప్పారు అమ్మ, నాన్న, అన్నయ్య.

చంద్రశేఖర్...అబ్బే! ఇంకా చంద్రశేఖరేమిటి! మా శ్రీవారు...చాలా కోప్పడ్డారు. అవునుమరి! ఎంతైనా అవమానానికి పురుషుడెలా తట్టుకుంటాడు? వెంటనే బయల్దేరాం! ఆయన గుమాస్తా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు.

అంతక్రితమే ఇక్కడ (అలహాబాదులో) ఓ ప్రైవేటు కంపె నీలో ఉద్యోగం ఆర్డర్సు వచ్చాయిలే. అంచేత జై పర మేశ్వరా!' అని జెండా ఎత్తేశాం.

అవునుగానీ! నువ్వుచెప్పు భారతీ. ఏం తప్పుచేశాను! అంత కఠోరంగా శాసించారు. పోనీలే! వారి అనురాగంలో అమ్మావాళ్లు అలాగ దూరంగా తరిమినా, నాకు బాధకలగడం లేదు. ఆయన నన్నెంతో ప్రాణంగా చూచుకుంటున్నారు. ఇక ఇంతకంటె నాకు కావలసిందేముంది భారతీ! చిన్నఇల్లు, చిన్న సంసారం, వారికి వచ్చేజీతం నూటఎనభై రూపాయలే అయినా. నాకిది స్వర్గంగా ఉంది! ఇంతకంటె ఏ భోగాలు, భాగ్యాలు ఎవరి పెట్టుపోతలు, ఆదరణలు నాకక్ఖర్లేదు.

అన్నట్లు ఈ సంగతి తెలుసా? కళ్యాణి, అత్తవారింటి జీవితం అధోగతిగా ఉందిట! అది నా పెండ్లికి అభివందనలు తెలుపుతూ వ్రాసిన ఉత్తరంలో వ్రాసిందీసంగతి. దానిభర్త సుధాకర్ బొత్తిగా, నోట్లో నాలికలేనివాడుట. భార్య నెలా చూచుకోవాలో తెలిసినా, తెలియనట్లుండే మెత్తనివాడుట. ఇంకా ఏమేమిటో రాసింది. 'సంసారంలో, అలాటి కలతలు అనుక్షణము ఎదురౌతూంటే, సహించడం కష్టం' అంటూ వ్రాసింది కళ్యాణి! కొన్ని నిజాలు ఉండవచ్చు. కాని, మన కళ్యాణి మనస్తత్త్వం నీకు తెలుసుగా? మధ్యతరగతి కుటుం బంలో పుట్టిందన్నమాటేగాని,ఒక్కర్తే సంతానం అవడంవల్ల ఎంత గారాబంగానో పెంచారు వాళ్ళమ్మా నాన్నాను! నీకు గుర్తుందా? మనం ముగ్గురం స్కూల్ ఫైనల్ చదువుతుండగా ఓరోజు...నువ్వో టెరిలిన్ చీరె కట్టుకువచ్చావు! రోజ్ కలర్ ది

కదూ? 'మా నాన్నగారు మెద్రాసంతా గాలించి పట్టుకు వచ్చారిది! టెక్శ్చరులోగాని, ఖరీదులో గాని దీనికి సాటి లేదు!' అనేశావు నువ్వు!

వెంటనే కళ్యాణి గర్జించింది: 'ఇంతకంటె బోలెడన్ని ఉంటాయి! కావాలంటే కొని, కట్టుకుని చూపిస్తాను!' అంది.

అంత పనీ చేసిందికూడాను! ఆ నెల వాళ్ళ నాన్నగారిని వెంటబెట్టుకుని మెద్రాసు వెళ్ళి, ఆకాశంకలర్ టెరిలిన్ చీర కొనుక్కుని వచ్చింది! తరువాత మెద్రాస్ వెళ్ళిరావడానికి, చీరెకు రెండువందల రూపాయలు అప్పు తేవలసివచ్చిందని వాళ్ళమ్మ నెత్తీనోరు బాదుకుంటే మాత్రం కళ్యాణి ఖాతరు చేసిందా!

ఇలాటి మూర్ఖపు పట్టుదల, మరీ సుస్నితమయిన మన స్తత్వం, ఒంటెత్తు గుణము ఉన్నవాళ్ళు, సామరస్యంతో జీవితయాత్ర సాగించడం కష్టం? అవునా?

అదుగో! నవ్వుతున్నావు! అప్పుడే ఆరిందలా ఎన్నో కబుర్లు చెబుతున్నానని కాదూ?

మరి నువ్వెలా ఉన్నావ్? మీ శ్రీవారు ..ఆనంద్‌గారు సారీ...సాక్షాత్తూ, మీ బావగారు ఎలా ఉన్నారు? భారతీ దేవి సౌందర్యారాధనలో, అనురాగఝరిలో మునిగి తేలుతూ తనని తాను మరిచి ఉండాలి! వ్యాపారం మూలపడలేదు కదా? పడితే మాత్రం ఏం? ఇద్దరికిద్దరు బంగారు పిచికలు!

ఈ నా జాబు చేరేసరికి, నువ్వెలా ఉంటావో చెప్పనా? ఆనంద్...అహం, మీ వారు,నువ్వు రేడియో దగ్గిర

కూర్చుని ఉంటారు! హాలుద్వారానికి కట్టివుండే రోజ్ నైలాన్ తెర, కిటికీలకుండే లేత నీలం జార్జెట్ తెరలు, కింద పరిచివున్న రంగురంగుల కాశ్మీర్ తివాసీలు, తూర్పు కిటికీలో నుంచి చురుకుచురుకుగా వస్తున్న సూర్యకిరణాలలో తళతళ లాడుతూంటే, రంగురంగుల ఇంద్రధనుస్సుల అందాల లోకంలో...స్వర్గంలో మైమరిచి ఉంటారు! హఠాత్తుగా నీకు గుర్తువస్తుంది. మాంఛి ప్రోగ్రాం ఏదో రేడియోలో ఉందని! నువ్వా స్టేషన్ పెట్టేస్తావ్ చిలిపిగా. శ్రీవారు మరో స్టేషన్‌కి తిప్పేస్తారు! ఉక్రోషంతో మళ్ళీ నువ్వు రేడియో మీద చెయ్యివేస్తావ్! మీ శ్రీవారు ఆ కోమలమైన చెయ్యి అల్లాగే నొక్కిపట్టుకుంటారు! నీ అందమైన కళ్ళల్లో ఎర్రని కోపం ఆయన్ని కవ్విస్తుంది! తప్పించుకోవాలని, చూచినా నీతరంకాదు! రెండు స్టేషన్ల మధ్య. రేడియో ముల్లు నిలిచి పోయి, అర్థంకాని శబ్దాలేవో ప్రసారం చేస్తూంటుంది! అబ్బే! అది మీ చెవి కెక్కదు!

నా ఉత్తరం పట్టుకువచ్చిన మీ పోలాయ్ ఆ దృశ్యం చూచి లోపలకు వెళదామా? వద్దా? అనే మీమాంసలో కొట్టుమిట్టాడతాడు, నిమిషంసేపు!

ఎల్లాగో నువ్వు ద్వారంకేసి చూచి, పోలాయ్‌ని చూచి, నీ మాటల్ని అణిచివేస్తున్న పెదవుల్ని బ్రహ్మప్రయత్నం మీద పక్కకు నెట్టి, "పోలాయ్" అనగలుగుతావు!

అప్పటికి గాని, మీవారు ఇహలోకంలోకి రారు! తీరా వచ్చాక పోలాయ్ ముందు బయటపడిపోవటం ఇష్టంలేక, లేనిపోని గాంభీర్యం తెచ్చిపెట్టుకుంటూ, ఏదో పని ఉన్నట్లు, పక్కగది

లోకి జారుకుంటారు ! మరి నీకు తప్పదుగా ! ఎలాగో ముఖం దాచుకుంటూ, శ్రీవారు వేసిన ముద్దల్ని తుడుచుకుంటూ ఉత్తరం అందుకుంటావ్ ! హోలాయ్ తెలివిగలవాడన్నావు కదూ ? అందుకే వారు పరిస్థితి గ్రహించి తప్పుకుపోతాడు !

తిన్నగా నేను గుర్తుకు వస్తాను !...

సరే... మీ ప్రణయసామ్రాజ్య పరిధినుంచి బయట కాస్త ఇవతలికి వచ్చినప్పుడు, ఈ బాల్యస్నేహితురాలికి చిన్న ఉత్తరంముక్క వ్రాసి పడేయ్ ! ఉంటాను మరి !

నీ

భవానీ శేఖర్."

* * *

ఉత్తరం చదివి, గాఢంగా నిట్టూర్చింది భారతి, పిచ్చి భవాని ! పెళ్ళాడింది ! తన బ్రతుకు ఆనందమయం చేసుకో గల వివేకం ఉంది భవానికి ! అంతవరకు బాగానే ఉంది! కాని తనను గురించి, తన దాంపత్యజీవితాన్ని గురించి ఎన్నెన్ని ఊహాగానాలు చేస్తూంది! ఎంతతియ్యగా దృశ్యాలు కల్పించుకుంటూంది ! ఎలా వ్రాసింది ? అబ్బ ! భవాని చిత్రించిన దృశ్యం తన జీవితంలో ఏనాటికయినా నిజమౌతుందా ?

చుట్టూ చూచింది భారతి ! భవాని వ్రాసిన వాతావరణం వర్ణన అక్షరాలా నిజమే ! కాని ఆ ఇంద్రధనుస్సులాంటి ఈ స్వర్గంలో భవాని వ్రాసిన ప్రణయచ్ఛాయలుకూడా లేవు! ఆ భాగం అలా వెలితిగా వట్టిగానే మిగిలిపోయి ఉంది. అది భర్తీ అవుతుందనే ఆశకూడా కలగడం లేదు!

"టంగ్......"

త్రుళ్ళిపడి చూచింది భారతి. బెడ్‌రూంలో నుంచి... బహుశః అగరువత్తుల గ్లాస్ కిందపడి ఉంటుంది! అంటే ఆనంద్ నిద్ర లేచాడన్న మాట! గబగబా లేచి వెళ్ళింది భారతి!

సోఫాలో బోర్లా అస్తవ్యస్తంగా పడుకుని, నిర్ల క్ష్యంగా కాళ్లు పైకీ, కిందికీ ఊపుతున్నాడు ఆనంద్! కాస్త దూరంలో టీపాయ్ మీదినించి కిందికిదొర్లిన అగరువత్తుల గ్లాసు పందిరిమంచం దగ్గిరగా దొర్లాడుతూంది!

ఉదయం తొమ్మిదిన్నర కావొస్తూంది. ఇక లేస్తారా?" భారతి మెల్లిగా భర్త తల నిమురుతూ అన్నది.

నిర్లక్ష్యంగా తల పైకెత్తి చూచాడు ఆనంద్!

ఎంత అందమైన కళ్ళు ముఖము అయినా, అలా ఎర్రగా, అలసటగా మారితే యెలాగో వుంటుంది! చిందర వందరగా ముఖంమీద పడుతున్న క్రాపు అతని ముఖాన్ని, కొంతవరకు మాత్రమే మరుగుపరచ గలిగింది.

"ఏమంటున్నావ్?" మెల్లిగా అడిగాడు ఆనంద్.

"చాలా పొద్దెక్కింది. ఇక శ్రీవారిని నిద్ర లేపమంటు న్నాను..."నవ్వుతూ అంది భారతి.

"అంత రాచకార్యా లేమున్నాయో?"

"ఏమీ లేకున్నా, కనీసం పళ్లు తోముకోవడం, ఫలహారం పుచ్చుకోవడం, స్నానంచేసి బట్టలు మార్చుకోవడం లాటి అవరోధాలు కొన్ని ఉన్నాయిగా!"

"ఉహుఁ! నా కిప్పుడు లేచే ఓపికా లేదు! పళ్లు తోముకోనూ లేను! బెడ్ కాఫీ పట్టుకురా!"

"ఇప్పుడా! పది గంటలు కావస్తూంటే బెడ్ కాఫీయా?" భారతిలో సహనం నశించిపోతూంది!

"ఊఁ ఇప్పుడే! అలా ఆశ్చర్యపోతావేం? బెడ్ కాఫీ తాగడం తప్పంటావా?"

"అబ్బే! తాగుడు కూడా తప్పు కాదు మీ ఉద్దేశ్యంలో! కానీ. నాకిలాంటి పద్ధతులంటే అసహ్యం! ఎంత శ్రీమంతులమయినా కావచ్చు! కాలు కదపకుండా కావలసిన వస్తువులన్నీ మనదగ్గరికే నడిపించగల సామర్థ్యము, తాహతు మనలో ఉండి ఉండవచ్చు! కాని, మానవులకు అవసరమైన ఆరోగ్యవిధులను కొన్నిటినైనా అనుసరించకపోవడం అసహ్యం కాదా?"

"ఇంతకీ నువ్వనేదేమిటి?" అసహనంగా ప్రశ్నించాడు ఆనంద్.

"పళ్లు తోముకోండి! కాఫీ పట్టుకవస్తాను! ఇదిగో మీరింత ఓపికలేనివారు కాబట్టే, బెడ్‌రూం పక్కనే బాత్‌రూం కట్టించేశారు మామయ్య! ఒక్క అడుగు నడవండి. బ్రష్షు టూత్ పేస్టు సోపు అన్నీ అక్కడే అమిర్చాను. ఊఁ, ఇదిగో నా చెయ్యి పట్టుకుని నడవండి!..." భారతి నవ్వుతూ వచ్చి ఆనంద్ చెయ్యి పట్టుకుంది!

ఒక్కసారిగా విదిలించికొట్టాడు!

"ఈ వెర్రివేషాలు నాదగ్గర వెయ్యకు భారతీ! నీకింత పట్టుదలయితే నాకేనా లేనిది? పో! కాఫీ పట్టుకురా!"

పేలవంగా నవ్వింది భారతి.

"నాకేం పట్టుదల బావా! అహాం పొరపాటు. పట్టుది లెందుకండీ నాకు! పళ్ళన్నీ వచ్చాక, పసిపిల్లలకయినా పళ్ళు తోముకోకుండా ఏదీ తినడానికి, తాగడానికి ఇవ్వరు పెద్దవాళ్ళెవరైనా! అలాటిది అన్నీ తెలిసిన మనం......"

"ఈ ఉపన్యాసాలు చాలుగాని, కాఫీ తెస్తావా లేదా?"

భారతి క్షణంసేపు భర్త ముఖంలోకిచూచింది. తీవ్రంగా ఉన్న ఆ మొండిపట్టుదల. అంతా అర్థమయిపోయిందామెకు! మరి కాస్సేపు తను మౌనం వహిస్తే. కాఫీ తాగకుండానే వెళ్లి పోతారు! ఇక యీ పూట భోజనానికి కాదు సరికదా, రేపయినా యింటికి వస్తారనేది అనుమానమే! ఏ క్లబ్బులోనో ఏ స్నేహితుడి యింట్లోనో, ఆ రెండూ కాకుంటే, ఏ హోటల్ రూంలోనో, రెండు మూడు రోజులు గడిపేస్తారు! అందరికి ఫోన్ చేసి, కూపీతీసి, జాడ తెలుసుకుని వెళ్ళి, బతిమాలుకుని, ప్రార్థించి కారులో కూర్చోబెట్టుకుని రావలసిన దుర్గతి తన కెన్నిమార్లో పట్టింది గతంలో. అంత రభసా ఎందుకు?

"మణీ! మణి! అయ్యగారు లేచారు! కాఫీ టిఫిను పట్టుకురా! కేక వేసింది భారతి.

మణి ట్రేలో కాఫీ, టిఫిను పట్టుకువచ్చి, టీపాయ్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"ఇంకా నువ్వు తీసుకోలేదూ?" రెండో కాఫీ కప్పు, ఫలహారం ప్లేటు చూస్తూ అడిగాడు.

"ఊహుఁ!"

"పతివ్రతా లక్షణం కాబోలు!" ఆనంద్ నవ్వుతో గది ప్రతిధ్వనించింది!

"ఎలా అయినా అనుకోండి! దయచేసి కాస్త మొహం కడుక్కోండి! ఇదుగో బేసిన్, నీళ్ళు, టవలు ఇక్కడికే పట్టుకువచ్చాను!"

ఆనంద్ వినిపించుకోకుండా గబగబా కాఫీ తాగి వెయ్యడం మొదలు పెట్టాడు.

ఉసూరుమని నిట్టూర్చింది భారతి! మెరపులాంటి ఆలోచనలు! పోనీ ఉద్దాలకుని భార్య చండికలాటి తత్త్వమేమో బావది!

"మీారు స్నానం చెయ్యవద్దులెండి! వేరే డ్రస్సిస్తాను. వేసుకుని వెళుదురుగాని..." అంది భారతి నవ్వుతూ.

"పిచ్చి భారతీ! ఈ నీ బావ నువ్వనుకునేంతటి తెలివి తక్కువవాడు కాడు! అలాగే నీయిష్టమే కానియ్! డ్రెస్ తీసిపెట్టు!" ఆనంద్ నవ్వుతూ బాత్ రూంవైపు సాగిపోయాడు. అయిదు నిముషాల తరువాత ముఖం, కాళ్లు చేతులు మాత్రం శుభ్రం చేసుకు వచ్చిన అతణ్ణి చూచి, తలవంచుకుంది భారతి! ఆమె తీసిపెట్టిన డ్రెస్ వేసుకుని, వెళ్ళిపోయాడు ఆనంద్.

కాంపౌండ్ గేటుదాటి మలుపు తిరిగి, దూసుకుపోతున్న కారుకింద పడి నలిగిపోయినా తన కింత బాధ ఉండదేమోననిపించింది భారతికి! పీడకలలా సాగుతున్న తన జీవితగమ

నాన్ని గురించి ఎంత పిచ్చిగా, ఎంత మధురంగా ఊహించు కుంటూంది భవాని! పిచ్చిగా నవ్వుకుంది భారతి!

* * *

"ఒక బాధ్యత వదిలిందన్న తృప్తేకాని, మరో బరువు కూడా నెత్తినపడుతుందన్న ఊహే లేకపోయింది! నాకు బట్టలు చిరిగిపోతే అనుకునే నాథుడే లేడు!... కాని ఊరికే తిని కూర్చునే వాళ్ళకి, డజన్లకొద్దీ కొనిపడేస్తుంటారు..."

కళ్యాణి వాగ్బాణాల చివర నిల్చివున్న వ్యక్తి ఎవరో పోల్చుకోవడానికెంతోసేపు పట్టలేదు సుధాకర్ కు.

"నేనేం తెమ్మనలేదు. వదినా! ప్రభాకరన్నయ్యే పట్టుకువచ్చాడు రెండు చీరెలూను." మీనాక్షి కంఠస్వరంలో జీరలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"కళ్యాణీ!" రాస్తున్న ఫైల్ నక్కడ పడవేసి పెద్దగా అరిచాడు సుధాకర్.

"అదుగో! అప్పుడే ఆయనగారు మండిపడుతున్నారు. నేనిప్పు డేమన్నానని? అయినా నెత్తిన నీళ్ళకుండ ఉంటుంది మీనాక్షీ! నీకు..." కళ్యాణి గబగబా లోపలికి వెళ్ళిపోయింది! సుధాకర్ తలపట్టుకుని కూర్చున్నాడు,

సాయంత్రం ఆఫీసునించి వచ్చేసరికి, మళ్ళీ రగడ వినిపిస్తూంది.

"మీనాక్షికికొత్తదుద్దులుచేయిస్తున్నారటగదత్తయ్యా? మీనాక్షి పెళ్ళికోసం చేసిన అప్పు అలాగేవుంది! డబ్బుకి కట

కటగా ఉందని మీకూ తెలుసుగదా! ఎవరికి వారిలా దుబారా చేస్తూంటే ఎలా చావాలి మగవాడు?''

పార్వతమ్మ గొణిగింది. ''అందరి చెవులకి కొత్తరకంవి ఉన్నాయని అఘోరిస్తూంటే, కూలి ఒక్కటేగదా అని, పాతవి మార్పిస్తున్నాను. కాకపోయినా కందకిలేని దురద కత్తిపీట కన్నట్లు, సుధాకరం ఇస్తూంటే, మధ్య నువ్వు బాధపడడం ఎందుకు?

ఎందుకా? చివరి కిలా అప్పులుపాలుచేసి, ఎవరిదారిని వారు మహారాజుల్లా ఉంటే, మా సంసారం గతేమాతుందో అంతుపట్టక, అందుకు...!

''కల్యాణీ!'' సుధాకర్ గర్జించాడు.

''అవును! నేనేమాటన్నా తప్పే. నా మెళ్లో గొలుసు తెగి, ఆర్నెల్లు అయింది. అతుకు పెట్టించే దిక్కులేదు. నేను నోరు తెరిస్తే, తలోక వేపు పులుల్లా పడతారు...''

''చూడు కల్యాణీ! మీనాక్షి ఇక ఇక్కడెంతో కాలం ఉండదు. శ్యామ్‌కి ఇంకో ఆరు నెలల్లో ట్రెయినింగ్ పూర్తయి పోతుంది. బి. ఇడి. డిగ్రీ వచ్చేస్తుంది. ఎక్కడో ఉద్యోగం చూచుకొని మీనాక్షిని వెంటబెట్టుకుని వెళ్ళిపోతాడు. ఒక వేపు చదువు! మరోవేపు తన తలిదండ్రులు మా మీనాక్షిని కష్టపెడతారేమోననే భయం! ఎటూ పాలుపోనిస్థితిలో మీనాక్షిని యిక్కడ ఉంచాడు శ్యామ్, ఉద్యోగం వచ్చిన మరునిమిషంలోనే మనం ఉంచమన్నా ఉంచడు తెలుసా?'' సుధాకర్, రాత్రి కల్యాణికి చెప్పాడు,

కల్యాణి మారు పలకలేదు.

"మీనాక్షికి మాత్రం ఇక్కడ ఉండాలని ఉండదంటావా? ఏ స్త్రీకయినా వివాహమయిన మరుక్షణంనుంచి, భర్త బాహువుల్లో ఒదిగిపోవాలనే ఉంటుంది. కాని చెల్లాయేంచేస్తుందీ? సగం చచ్చిఉంటూంది. ఉదయం నా చేతికి పోస్టు చెయ్యమని కవరొకటి యిచ్చింది.

"అది దాని భర్తకి వ్రాసుకున్న జాబు! ఎందుకనో నాకు, ఆవేశంలో మీనాక్షి అతగాడికేమేమిటో వ్రాసి ఉంటుందని భయం వేసింది. ఎంతోసేపు; చదవాలా, వద్దా అని సంశయిస్తూనే, చదువుదామనే నిర్ణయానికి వచ్చాను. కేవలం వాళ్ళ ప్రణయ రహస్యాలు తెలుసుకుందామనే కుతూహలంతో కాదు, తొందరలో మీనాక్షి రాసిన జాబు చదువుకుని శ్యామ్ చదువు పాడుచేసుకుంటాడేమోననే భయంతో మాత్రమే! ఇదుగో చదువు! కల్యాణితో నువ్వు చదివినట్లు చెప్పకు. రేపు నేనే దానికి చెప్పి స్థిమిత పరుస్తాను..."

సుధాకర్ కవరు ఇచ్చాడు.

"ఎన్నాళ్ళిలా నేనిక్కడ ఉండడం? కల్యాణి వదిన వాగ్బాణాలతో నా మనసు రక్తసిక్తమై పోతూంది. మీతో బాటు బయలుదేరి వస్తానని మొత్తుకున్నా నారోజు! 'మా అమ్మ, నాన్నల సంగతి నాకు తెలుసు మీనా, అసలే కట్నం తీసుకోలేదని కోపంగా ఉన్నారు. దానికితోడు నేను లేకుండా నువ్వు వాళ్ళదగ్గిర ఉండడం సంభవిస్తే, నామీద కోపమంతా, దానికి కారకురాలవయినా నీమీద (వాళ్ళ ఉద్దేశ్యం ప్రకారం

తప్పులన్నీ కోడలివి) నాలుగింతలుగా చూపిస్తారు. అదీగాక, నాకా ఉద్యోగం లేదు. సరదా సంతోషాలమాట అలాగ ఉంచినా, కనీసం ప్రతి దమ్మిడీకి మా నాన్నని, అమ్మని అడగ వలసిన అవస్థ నీకు కలిగించడం నాకు సమంజసంగా తోచడం లేదు. మీ పుట్టింట్లో అయితే, శారీరకంగా, మానసికంగా కూడా చదువు, సుఖము రెండు ఉంటాయి. ఇక మనిద్దరి విరహము అంటావా? ఏం చేస్తాం? కొన్నాళ్ళు...భరించాలి మరి...అప్పుడప్పుడు వస్తూంటానుగా?' అన్నారు. మీరు చెప్పింది సబబు కాదనను. కాని, మా పుట్టింటి విషయంలో చాలా అపోహపడ్డారు మీరు బహుశః వివాహమయిన తరువాత ఎక్కువ కాలం పుట్టింట్లోవుంటే, ఏ ఆడదానికయినా ఇంతేనేమో.

"ప్రభాకరం అన్నయ్య తనకి, చదువుకోసం సుధాకరం అన్నయ్య పంపించే డబ్బుతో, తన ఖర్చులు తగ్గించుకుని, సెలవులకి వచ్చేటప్పుడల్లా, నాకు చీరెలో, రవికెలో తెస్తాడు. చిన్నన్నయ్య దుబారా చేస్తున్నాడనీ, నేనేదో అడిగి కొని పించుకుంటున్నాననీ వదినబాధ. పెద్దన్నయ్య సంగతి మీకు తెలుసుగదా? అమృతం కురిపిస్తాడు. ఎప్పటికప్పుడు నే బాధ పడినప్పుడల్లా! 'మీనాక్షీ! మీవదిన సంగతి నీకు తెలియదూ? మాట దురుసుతనం ఎక్కువ. గారాబంగా పెరిగింది. తన మాటకి అడ్డులేకుండా జరుపుకుంటుంది. మన పరిస్థితులు ఆర్థిక మయిన ఇబ్బందులు అల్లాగే వచ్చాయి. ఆ ఆక్రోశం అలా అనుకోకుండా వెళ్లడిస్తుంది. నువ్వు బాధపడవద్దమ్మా! నేనున్నా నుగా, నీకేం కావాలన్నా, మీ వదినతో చెప్పక్కర్లేదు. నాతో

మాట మాత్రం అనుచాలు. ప్రభాకరానికి ఈ సంవత్సరంతో బి.ఎస్.సి. పూర్తి అవుతుంది. వాడుకూడా ఏదో ఉద్యోగం చూచుకుంటాడు. మీవాడికి చదువు అయిపోతుంది. కాస్త ఓర్చుకోవాలి...' పెద్దన్నయ్య అలాగ చెబుతూ, నా తల నిమురుతూంటే, 'అనవసరంగా వదినని ఎందుకలా తిట్టుకున్నానా ?' అని ఎంతగానో పశ్చాత్తాపపడిపోతాను. కాని, ఏం లాభం? మరునిమిషంలోనే ఏదో ఓ సాకుతో కల్యాణి వదిన హాలాహలం వర్షిస్తుంది.

"నీకు తెలియదు. కోడలిని నలుచుకుని తినడమనే విద్యలో ఆరితేరినవాళ్ళు మా అమ్మ, నాన్న! అంటారు మీరు. కాని, స్వానుభవంతో చెబుతున్నాను. అత్తగారిల్లు నరకమయినా, స్వర్గమయినా, అత్తమామలు రాక్షసులయినా, భర్త యముడయినా వివాహిత స్త్రీకి అత్తిల్లే స్థానం. పుట్టినింట్లో నానా మాటలూ పడడంకంటె, అత్తగారింట్లో అష్టకష్టాలూ పడవచ్చు. లేదా అక్కడేపడి చావవచ్చు!... కనీసం మానసికతృప్తి అయినా మిగులుతుంది.

"ఇక ఇక్కడ ఒక్కక్షణం ఉండలేను. మీరు వెంటనే వచ్చి నన్ను అత్తగారూ వాళ్ళదగ్గిర దిగబెట్టి వెళ్ళండి! ఇంతకంటె, ఇంకేమీ వ్రాయలేను. బయలుదేరి వస్తారుకదూ? నన్ను వెంటబెట్టుకుని వెడతారుకదూ?

మీ రాకకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తున్న

మీ

మీనాక్షి"

సుధాకర్ గాఢంగా నిట్టూర్చాడు.

"చదివావు కదూ? ఎంత బాధపడుతూందో చూచావా? నా మాటవిను. ఇక రేపటినుంచి ఏ విషయంలోను మీనాక్షిని బాధించకు..."

ఛర్రుమంది కళ్యాణి, చేతిలో ఉత్తరం భర్తపైన గిరవాటు వేస్తూ. "నేనేం బాధపెడుతున్నానని నాకు మీ రీ బోధలు చెయ్యడం? ఆవిడ భర్తకి రాసుకోడం బాగానేవుంది! మీనాక్షి పెళ్ళికి చేసిన అప్పు అలాగే ఉందా? మరిది ప్రభాకర్ చదువు కోసం కొంత అప్పు చేస్తున్నారా? మీరు ఎంతగా రాత్రింబగళ్ళు కష్టపడినా వచ్చేది రెండువందలకు మించడం లేదుకదా? ఇలాగ ఎవరికి వాళ్ళు ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెడుతూంటే, ఎలాగ సహించడం?"

"అవన్నీ నీకెందుకు? సర్దుకుపోయే వాణ్ణి నేనున్నానుగా!"

"అంటే ఎవరెంత దుబారా చేసినా ఫరవాలేదన్న మాట! ఆ మాట చెప్పారు కారేం? నేనూ నా ఇష్టంవచ్చినట్లు షాపులో ఖాతా పెట్టి, చీరెలు, జాకెట్లు ఫ్యాన్సీవస్తువులు కొనేస్తాను రేపటినుంచి..."

"కళ్యాణీ!" సుధాకర్ నుదుటిమీద చేత్తో కొట్టుకున్నాడు.

"ఆ రాయికన్నా అర్థమౌతుందేమోగాని, నీకు మాత్రం చెప్పలేను..."

పక్కన పడుకుని ఉన్న కళ్యాణి శ్వాస విషసర్పం విడిచే బుసలా అనిపిస్తోంది సుధాకర్‌కు! వెంటనే లేచి వెళ్ళి పడ

కుర్చీలో పడుకున్నాడు! ఎన్నో రాత్రులు ఇలా అశాంతి తోనే గడిచి పోతున్నాయి. శారీరికంగా దగ్గరగా ఉన్నా, కళ్యాణి,సుధాకర్ లు మానసికంగా దూరం అవుతున్నారు...

* * * *

"చిటపట చినుకులు పడుతూ ఉంటే,

చలికా డే సరసన ఉంటే..." ఆహాయి ఎంతో బాగుం టుందని వర్ణించా డొక కవి...అది ఎంత నిజమో స్వాను భవంలో అర్థమౌతూంది ..కదూ?"

మృదువుగా భవాని బుగ్గలు స్పృశిస్తూ అడిగాడు చంద్రశేఖర్ ! అరమోడ్పు కన్నులతో ఏవో లోకాల్లో విహ రిస్తూ, మత్తుగా చూచింది భవాని భర్తవేపు.

"భవానీ! నిజంగా నీకు మీవాళ్లందరు వెలివేశారని బాధగా లేదూ?" చంద్రశేఖర్ కంఠంలో అనురాగం తొణి కిస లాడుతూంది.

బయట సన్నన జల్లు పడుతూంది. ఇంట్లో చల్లగా, చలి చలిగా వుంది.

భవాని మెల్లిగా నవ్వింది.

"అలా నవ్వుతా వేమిటి? నా ప్రశ్న కదా సమా ధానం?"

"తల్లిదండ్రులు కని పెంచుతారు! వాత్సల్యం కురిపి స్తారు! అన్నదమ్ములు. అక్క చెల్లెళ్ళు ఆదరణ చూపిస్తారు.

కాని, భర్త సాన్నిధ్యంలో స్త్రీ పై వాటి కన్నిటికి అతీతమైన మధురానుభూతి పొందుతుంది. అది నిస్సందేహంగా, తల్లి దండ్రుల. బంధుజనులనించి, వచ్చే రకరకాల మమకారాలన్నిటికి అతీతమైనదని స్వానుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఇక బాధ ఎందుకు ?"

చప్పట్లు చరిచాడు చంద్రశేఖర్. "భేష్ ! భేష్! ముందు ముందు రచయిత్రివి కాబోయే సూచన లున్నాయ్!"

"అలా వెక్కిరిస్తే నే నసలేమీ మాట్లాడను !" భవాని బుంగమూతి శేఖర్‌ని వెర్రివాణ్ణి చేసేస్తోంది.

మాట్లాడవూ ? ఎలా మాట్లాడవో చూస్తాను."

"అబ్బ ! ఇలా నవ్విస్తే నే బ్రతకాలా వద్దా ?"

"పోస్ట్"

వరండాలో కేక విని ఇద్దరూ త్రుళ్ళిపడ్డారు ! చంద్రశేఖర్ మెల్లిగా నవ్వాడు, భవానిని వదిలేస్తూ "పానకంలో పుడకలంటే ఇలాటివే ! ఉండు. జాబులేవో వచ్చినట్లున్నాయి ! నా కెలాగు నా అనేవాళ్ళు లేరు. ఏమి వచ్చినా నీకేగదా ?" అంటూ బయటికి వెళ్ళాడు చంద్రశేఖర్.

"పెద్ద కవరు వచ్చింది భవానీ నీకు ! బరువును బట్టి చూస్తే, నవలికో. నవలో అయి ఉండవచ్చునని అనిపిస్తూంది...చంద్రశేఖర్ కవరు చూపిస్తూ అన్నాడు.

"ఏదీ యిలా యివ్వండి ! భారతి దగ్గిరనుంచి అయి ఉంటుంది..."

భవాని కవరు తీసుకోబోయింది.

"అంత సులభంగా ఇస్తానా? దగ్గిరికివచ్చి తీసుకో..." చంద్రశేఖర్ చెయ్యి పైకెత్తాడు.

"ఎలాగ? తాడిప్రమాణం ఉంటిరి! నాకెలాగ అందుతుంది?" భవాని ఉక్రోషం ఎక్కువైపోతూంది.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? అయిదడుగుల రెండంగుళాలు! దా! అందుకో!"

భవాని గబుక్కున వెళ్ళి లాక్కుంది.

"పోనీలే అని వదిలివేశాను ఈసారికి!"

'ధన్యురాలిని...'' గబగబా రూంలోకి పరిగెత్తింది భవాని, కవరు జాగ్రత్తగా చింపుతూ.

హైదరాబాదు,
5—8—'61.

"డియర్ భవాని,

నీ జాబుచేరి రెండు నెలలు కావస్తూంది! జవాబు వ్రాద్దామనుకుంటూనే, ఓపికలేక వాయిదా వేస్తూ వచ్చాను. మరోలా అనుకోవద్దు. నువ్వు, మీవారు బాగున్నారనుకుంటాను. మీరిద్దరు సంతోషంగా, అనురాగంతో వుంటే ఇక అంతకంటే కావలసింది ఏమి ఉంది? నువ్వు అలాగ పెళ్ళిచేసుకున్నందుకు నేనేమీ అనుకోలేదులే!

"మావారికీ మధ్య చాలా జబ్బుచేసింది. గాస్ట్రిక్ ట్రబుల్ అనీ, లివర్ కంప్లైంట్ అనీ డాక్టర్లు చెప్పారు.

వారంరోజులనుంచీ పథ్యం పుచ్చుకుంటున్నారు. చాలా నీరసించిపోయారు.

"భవానీ ? నా దాంపత్య జీవితాన్ని గురించి నువ్వు ఏమేమో ఊహించుకుంటున్నావు. నా కెన్నెన్నో వ్రాశావు. చదివి, ఏడవాలో, నవ్వాలో అర్థంకావడం లేదు! నా జీవితంలోని చేదు రుచి చూపించి నీ మనస్సు కూడా యెందుకు పాడుచెయ్యాలనే ఉద్దేశ్యంతో ఏనాడూ నీకేమీ వ్రాసుకోలేదు. కాని, ఈ రోజు యెందుచేతనో మనస్సును అదుపులో పెట్టుకోలేకుండా ఉన్నాను. మా బావ ...... అదే మా వారిని గురించి నీకు తెలిసిందల్లా కొద్ది మాత్రమే! తల్లి లేకున్నా, తండ్రి చేతుల్లో అతి గారాబంగా పెరిగి, లక్షల ఆస్తికి వారసు లయ్యారు. లక్ష్మీపుత్రులు, అందము, చదువు, సంస్కారము ఉన్న మనిషి, కాని, వీటి అన్నిటి వెనుక, వారి మరోరూపాన్ని నేను కాపరానికి వచ్చిన తరువాత చూచాను. ఒక్క మాటలో వర్ణించాలంటే, ఎంత డబ్బు వుందో, అన్ని వ్యసనాలు ఉన్నాయి! ఎంత రూపసంపద వుందో అంత మూర్ఖపు పట్టుదల ఉంది! ఎంత సంస్కారవంతులుగా కనిపిస్తారో అంతటి మకిలిభావాల మనిషి!

"భర్త నిలాగ నిందించడం భారత స్త్రీకి తగదని అంటావేమో నువ్వు! కాని, నేను మనిషినే కదా! ఒక్కొక్క సారి, నా ఒంటరితనానికి నాకే జాలి వేస్తూంది. చిన్నప్పటి నుంచి 'బావే పంచ ప్రాణాలు' అని నమ్మిన నాకు, బావ, భగవంతుడు కూడా ఇంతటి కఠిన శిక్ష వేస్తాడనుకోలేదు. మరో తమాషా, సరదాకైనా నేను తనను, 'బావ' అనకూడ

డట ! భర్తనే అవమానించడమట అది ! అది అలా ఉంచు. నా దాంపత్య జీవితంలో, ఒక రోజును గురించి, కొన్ని ఘట్టాలు వర్ణించమంటావా ?

“ఉదయం లేచి పళ్లు తోముకోడానికి కూడా మొండి కెత్తి, ఎలాగో టిఫిను, కాఫీ పుచ్చుకుని కారులో వెళ్ళిపో తారు. వ్యాపార విషయాలేం చూచుకుంటారో, నాకు తెలి యదు. ముప్పాతిక ఫోన్ కాల్స్ యింటికే వస్తాయి ! తెలిసిన వాటికి నేనే సమాధానం చెబుతాను. తెలియనివి నోట్ చేసి పెట్టుకుని, శ్రీవారు ప్రసన్నంగా వున్నప్పుడు (అది అరుదే ననుకో !) ముందు పెడతాను. ఆ వెళ్ళిన వెళ్లడం క్లబ్బులో పేకాట ! నైట్ క్లబ్బుల్లో డాన్సులు ! ఆ తరవాత, ఏ మగువ కౌగిలిలోనో కాలం గడిపి, ఏ అర్ధరాత్రికో యిల్లు చేరుకుం టారు ! మద్యనిషేధం ఉంటూ వచ్చింది కానీ, తాగుడు ఎక్కడ అరికడుతున్నారు ? ప్రొహిబిషన్ సబిన్స్పెక్టరు కూడా మావారితో బాటు తాగి, తూలి రోడ్డుమీద పడి పోతే, గుట్టుగా ఇల్లు చేర్చారుట ఈ మధ్య ఒకసారి !

“ఓసారి ఏమైందో తెలుసా ? రాత్రి ఏడు కావస్తోంది. ఉదయం వెళ్ళిన పెద్దమనిషి అంతవరకు అజ లేరు. వారు వస్తారని అంతవరకు భోజనం చెయ్యకుండా కూర్చుని ఉన్నాను. వేయికళ్ళతో ఎదురుచూస్తూ, ఆకలికూడా చచ్చి పోయిందిలే నాకు ! వంటవాడు మణి ‘అమ్మగారూ వంటయి పోయింది !’ అన్నాడు.

“అన్నీ డైనింగ్ టేబిల్ మీద అమర్చి నువ్వెళ్ళిపో !” అన్నాను.

అన్నీ సిద్ధంచేసి వెళ్ళిపోయాడు. పోలాయ్ మా బెడ్ రూంలో పక్కలు సరిచేసి, ఫ్లవర్ వాజ్‌లో నైట్‌క్వీను, రోజా, పారిజాతాలు నింపి, అగరువత్తులు పెట్టేసి వెళ్ళిపోయాడు. లక్ష్మి యింట్లో సామానంతా సర్దేసి వెళ్ళిపోయింది. పోలాయ్ కోసం, లక్ష్మికోసం మా కాంపౌండ్‌లోనే ఔటాహౌస్‌లా చిన్న పూరిల్లు బంగళా వెనుక వేపున కట్టించాం యీ మధ్య. అందరు యెవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

లంకంత మేడ, చుట్టూ రంగు రంగుల తెరలు. నీలి రంగు బార్ లైట్ హాలంతటా మెత్తటి కాంతిని ప్రసరింప చేస్తూంది. మొసెయిక్ ఫ్లోర్ నిగనిగ మెరుస్తోంది. బెడ్‌రూం కేసి నడిచాను. పారిజాతాల పరిమళం, గులాబీల సువాసన, నైట్‌క్వీన్ మత్తు కలిగిస్తున్నాయి. కానీ ఇవన్నీ, ఏనాడు వారు తేరిపారచూడలేదు. ఎదురుగా కనిపిస్తున్న పందిరి మంచాలు వెక్కిరిస్తున్నాయి. బహుశః ఈ అవకాశాలన్నీ ఉన్న మరో దంపతులయితే ఎంత స్వర్గసుఖాలనుభవించేవారో! ఎలాటి స్వప్నలోకాల్లో విహరించేవారో! ఇదే కాబోలు; 'అన్నీవున్నా రాత ఒక్కటే తక్కువ!' అన్నమాట కర్థం!

గిరుక్కున వెనుదిరిగాను. ఏమిటో ఆ అలంకరణ, బంగళా అంతా నన్ను, నా పరిస్థితిని అవహేళన చేస్తున్నట్లనిపించింది, క్షణకాలం! నిలవలేక బయటికి పరిగెత్తాను. అనుకోకుండా తోటలో తిరిగి, బంగళా వెనక్కు నడిచాను. మాలతీ లత దగ్గర కాళ్ళు ఆగిపోయాయి. అందంగా చక్కగా అల్లించాలనే ఉత్సాహంతో, ప్రత్యేకంగా తీగె జల్లెడ తెప్పించి అమర్చాను. పోలాయ్ చేత వెదురు బద్దలతో ఆర్చిలా కట్టిం

ఉంచాను. కాని ఏం లాభం? అదేమిటో, మాలతీ లత పందిరి పైకి పాకటంలేదు. అక్కడే నలిస్తూంది. దూరాన ఉన్న గడ్డి తీగె ఏదో గబగబా పాకివచ్చి, తీగె జల్లెడంతా అలుముకుంటూంది.

అర్హత, అవకాశము ఉన్నా, అల్లుకోలేని బలహీనత ఒకవేపు, ఏదీ లేకున్నా, అందంగా పాకిపోతున్న సామర్థ్యం మరోవేపు! సృష్టిలోని వింతే ఇదేమో?

మొన్ననోసారి కాత్యాయని కూతురు ఉష పుట్టిన రోజు పండక్కి కానుకలు తీసుకుని వెళ్లాను. నేను వెళ్లేసరికి పేరంటాళ్ళంతా వచ్చివెళ్ళారుట.

'ఎలాగు వచ్చావు తెమిలి! కాస్తలా డాబామీదికి వెళ్ళి కూర్చుందాం రా, భారతీ!' అంటూ రెక్క పుచ్చుకు లాక్కెళ్ళింది కాత్యాయని.

డాబామీది స్తంభాలకు పెనవేసుకుని అందంగా ఊగుతున్న మాలతీ లతను చూచి, ఎంతో ముగ్ధురాలి నయ్యాను, 'ఎంచక్కా పెంచావే, కాత్యాయనీ!' అన్నాను మురిసిపోతూ.

'రామ రామ! నేను పెంచలేదు. నాకలాటి ఓపిక లేదు. అదే అల్లుకుంటూంది. పోనీలే అని ఊరుకున్నాను' అంది.

జీవితమూ ఇంతే కాబోలు. మమతానుబంధాలు బిగించిన కొద్దీ, జీవితంలో ఆనందం మరుగై పోతుంది. వాటి నిర్లక్ష్యం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

'మీపాప పుట్టిననాడు మీవారు లేరా ఏమిటి ? మరి కనిపించరేం ?' యథాలాపంగా అడిగాను.

"లేకేం ఉన్నానండోయ్! 'మా ఆడవాళ్ళ సరదాలలో మీరు పాల్గొనవద్ద'ని మా శ్రీమతి ముందుగానే హెచ్చరించి, ఈ గదిలో అష్టదిగ్బంధనం చేసి కూర్చోబెట్టింది నన్ను! ఏం చేస్తాం? కలికాలం! మీ ఆడవాళ్ళకి అన్ని హక్కులూ ఉన్నాయి కదా! కాదు కూడదంటే పురుషుల దౌర్జన్యాలను గురించి, ఆడవాళ్ళ అవస్థలను గురించి పుస్తకాల్లో ఏకేస్తారు! అందుకని బయటికి రాలేదండీ!"

అనుకోకుండా వాక్ప్రవాహానికి రూపంలా వచ్చిన మనోహర్‌ను చూచి, తబ్బిబ్బుపడిపోయి, ఏం చెయ్యాలో తోచక, మర్యాద కోసం నవ్వి ఊరుకున్నాను. కాస్సేపు కబుర్లలో పాల్గొన్నాడు మనోహర్ కూడా.

"వెళ్ళొస్తాను, కాత్యాయనీ! వెళ్ళొస్తానండీ!" వచ్చి కార్లో కూర్చున్నాను. కారు కదలబోతూంది. అనుకోకుండా అటు తిరిగి చూచాను. నాకు టాటా చెప్పి, ఇద్దరు నిల్చుని ఉన్నారు కాత్యాయనీ, మనోహర్‌లు. మనోహర్ ఏదో తమాషాగా చెబుతూ, మధురంగా నవ్వుతూ, కాత్యాయని నడుం చుట్టూరా చెయ్యి వేశాడు. కాత్యాయని కళ్ళతోనే వారిస్తూ మృదువుగా నవ్వుతూంది.

కారు కదిలింది. గుండెలు మండిపోతున్నాయి. అందం వుంది. చదువు, సంస్కారమూ, ఐశ్వర్యమూ, అన్నీ ఉన్నాయి నాకు! కానీ ఏమిటీ వెలితి? నాకు కాత్యాయనిలా ఆనందించే

అర్థాంతి ఎందుకు లేకపోయింది ? నేను చేసిన పాప మేమిటి ? కొందరు భార్యాభర్తలు ఆర్థికలోపాలతో సతమతమౌతూంటారు. మరికొందరు అత్తమామలు, ఆడబిడ్డలు, బిడ్డలు వగైరా ప్రతిబంధకాలతో నరకయాతన అనుభవిస్తూంటారు. మరికొందరు అర్థంలేని పంతాలతో, పౌరుషాలతో, బ్రతుకులో చిచ్చుపెట్టుకుంటుంటారు కాని నాకు ? వారే సర్వస్వం ! ఈ మండుతున్న హృదయం. వారి గుండెలమీద సేద తీర్చుకొనగలిగితే ! ఈ అందమైన శరీరం వారి కౌగిలిలో కరిగిపోగలిగితే ! ఈ నా అందమైన కళ్ళు, వారి చూపుల్లో కలసిపోగలిగితే ! ఇక వేరే స్వర్గం ఎక్కడ ఉంది ! నాకంటే అదృష్టవంతురాలు మరెక్కడ ఉండబోదు.

కాని, వివాహమై అప్పుడే మూడేళ్ళు కావస్తోంది. పెళ్ళయిన కొత్తలో పదిపదిహేను రోజులు చవిచూచిన జీవిత మాధుర్యంలోని అనుభూతి మాత్రమే మిగిలిపోయింది. అంతే. కారు బంగళాముందు ఆగిన సంగతికూడా నేను గమనించలేకపోయాను.

ఇంట్లో సందడిగా ఉంటే ఆశ్చర్యపోయాను.

పోలాయ్ ఎదురుగా వచ్చి చెప్పాడు : 'అయ్యగారి వేపు దూరపు బంధువులంటమ్మగారూ, విమలమ్మగారంట. ఆవిడ, ఆమెగారి మరిదిగారంట, సురేశబాబు వచ్చారు. మీరటు ఎళ్ళంగానే. కావలసినవన్నీ చూసి, ఆగదిలో కూచోబెట్టాను.'

గబగబా లోపలికి కెళ్లాను.

'ఏం వదినా ? గుర్తున్నానా ?' అంది విమల.

"ఏం, గుర్తులేకేం, విమలా! మా పెళ్ళయిన కొత్తలో చూడడం, మళ్ళీ యిదే! బావున్నావా? చాలా తగ్గిపోయా వెందుకో! అతగాడు మీ మరిదా? ఏం చదువుతున్నాడు?"

'ఊఁ, సురేష్, హౌస్ సర్జన్ పూర్తయింది. ఇక ఎక్కడన్నా ప్రాక్టీస్ పెట్టాలనుకుంటున్నాడు' అంది విమల.

'మిమ్మల్ని ఇదే చూడడం! మా వదిన చెబితే, చాలా సార్లు విన్నాను మిమ్మల్ని గురించి...నాకు అక్కయ్యా వరసౌతారనుకుంటాను' అన్నాడు సురేష్.

చాలాసందడిగా గడిచాయి రెండు మూడుగంటలు.

సుమారు పదిమార్లేనా అడిగివుంటుంది విమల 'అన్నయ్య ఇంకా రాలేదేం, వదినా?' అని.

'ఒకొక్కరోజు అంతే, విమలా! ఈ వ్యాపారాలంత బండచాకిరీ మరోటి లేదనుకో. ఎగుమతులు, దిగుమతులు, లైసెన్సులు, కేసులు నానాగొడవలూను. క్షణం తీరిక లేదు...' నోటికి వచ్చినట్లు అబద్ధాలు పేలెయ్యడం మొదలెట్టాను.

గుండెలు మాత్రం దడదడ కొట్టుకుంటున్నాయి— ఏ నిమిషాన, వారు తాగి, తూలుతూ, పేలుతూ వస్తారోనని!

విమల, సురేషు భోజనాలు చేసి, గెస్టురూంలో వాళ్ళ కోసం ప్రత్యేకించిన పక్కలమీద పడుకున్నారు.

పదకొండు, పన్నెండుకూడా దాటిపోయింది. వారిజాడ లేదు. ఫోన్ చేద్దామని ఆఫీసురూం వేపు నడుస్తున్నాను. అప్రయత్నంగా విమలా వాళ్ళు పడుకున్న కిటికీ వేపు దృష్టి మర

లింది. కిటికీ కర్టెన్ తొలగివుంది. నా కళ్లే నేను నమ్మలేక పోయాను. జుగుప్సతో ఒళ్ళంతా గగుర్పొడిచింది. విమల. సురేష్ ప్రపంచాన్ని విస్మరించి, ఒకరిలో ఒకరు లీనమై... ఛీ...!

గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళాను. విమల భర్త రమేష్ అప్పుడప్పుడు వచ్చి వెళ్ళుతూంటాడు ఇక్కడికి. వ్యాపారంలో ఏవో విషయాలు మాట్లాడి వెళ్ళుతూంటాడు. మనిషి ఎంత బావుంటాడో, మనస్సంత మంచిది పైపెచ్చు విమలను గురించి అస్తమానము పొగుడుతూ, 'చెల్లాయీ! నువ్వేమో రెండ్రోజు లుండమంటావ్. అక్కడ మీ వదిన నన్నొదిలి క్షణం ఉండ లేదు. నే నిలా బయలుదేరి నప్పటినుంచి, కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తూంటుంది. ఒక్కరోజు ఆలస్యమైతే ఇక దుఃఖము, కోపము ఏకమై ఓ న్యూసెన్ తయారు చేస్తుంది. అందుకని దయచేసి మరోలా అనుకోకు. ఈమారెప్పుడేనా సతీసమేతంగా వచ్చి ఉంటానులే నువ్వెళ్ళమనేదాకా కదలను! సరా ?' అంటాడు.

శరీరం జలదరించింది. పాపం! రమేష్ ! పంచప్రాణాలు విమలకోసం అర్పిస్తాడు. విమల చిరునవ్వులో స్వర్గధామాల్ని ఊహించుకుంటాడు. అలాటి రమేష్‌ను, ఇంత అన్యాయం చేస్తూందా ? తనూ ఒక స్త్రీయేనా ? పైగా రమేష్ మాటల్ని బట్టి చూస్తే ఎంత అందంగా వంచిస్తూంది అతణ్ణి! ఆత్మవంచన చేసుకుంటూ, మనసాక్షి నెలా మభ్యపెట్టగలుగుతూంది ? అన్నీ వుండికూడా, అపురూపంగా చూచుకునే భర్త కంత దారుణంగా ద్రోహం చేస్తున్న విమల మనస్తత్వం ఏమిటి ?

కండకావరం కాక మరేమిటి ? స్త్రీస్వాతంత్ర్యాన్ని కలుషితం చెయ్యడం గాక మరేమిటి !

మనస్సంతా వికలమైపోయింది. తెల్లవారు ఝామున వారు వచ్చారు. ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారు. నాకు తెలుసు. వారి ఉద్దేశంలో మద్యం సీసా కెంతటి విలువ ఉందో!

మర్నాడు ఉదయం విమల. సురేష్ ప్రయాణమైనారు. వెళ్ళేముందు విమల రహస్యంగా నన్నడిగింది : 'వదినా! నిజం చెప్పు ! అన్నయ్య వ్యాపార విషయాలవల్లే అలా తీరిక లేకుండా ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతున్నాడంటావా !'

ఏదో నేను చెప్పబోయే అంతలోనే, తనే అంది మళ్ళీ :

'నువ్వు దాచిపెట్టినంతమాత్రాన నాకు తెలియకపోలేదులే. అయితే, వదినా! నా దొక్క సలహా. నువ్వేమైనా అనుకో. ఏదో పిచ్చి పిచ్చి సిద్ధాంతాలతో మనల్ని మనం బంధించుకుని, ధర్మాధర్మాలనే అర్థంలేని భయాలతో మన చుట్టు పరిధుల్ని గీసుకుని, అందులోనే మగ్గుతూ జీవితాన్ని చేజేతులా ధ్వంసం చేసుకోవడంలో అర్థంలేదు ! అందువల్ల సాధించేది లేదు ! అవకాశమున్నపుడు అనుభవించడానికి సిద్ధంగా ఉండాలి !'

విమల ఉపన్యాసంలోని అంతరార్థమేదో నాకు బాగా తెలుసు. విమల భావం ప్రకారం నీతి నియమాల్ని మంట గలపవచ్చు. ఆ వ్యవహారం డబ్బుచాటున కడిగేసుకోవచ్చు. అదే జీవితంలోని ఆనందాన్ని అనుభవించడమట. కోపం

కట్టలు తెంచుకుంది. తీవ్రంగా జవాబు చెబుదామనుకుంటు న్నంతలోనే వారు లేచి వచ్చారు.

'విమలా, ఈరోజే వెళ్ళాలా? నాలుగురోజు లుండ గూడదూ? అంత తొందర పనులుంటే, సురేష్ వెళతాడులే.' అన్నారు.

"వద్దన్నయ్యా! వారి సంగతి నీకు తెలుసు! నేను లేకుంటే క్షణం తోచదు వారికి. తమ పనులు తమరు చేసు కోరు. మరీ పసిపిల్లాడిలా...అసలు స్టేషన్‌కి వచ్చి వుంటారు కూడా..."

విమల సిగ్గులోని ఆ కృత్రిమత్వం, ఆ మాటల పొందిక, నిస్సంకోచంగా మాట్లాడుతున్న ఆ తీరు గమనిస్తూ విస్తు పోయాను.

విమల, సురేష్ కారులో వెళ్ళిపోయారు.

వారు విరగబడి నవ్వుతున్నారు.

'ఏమిటా నవ్వు?' ఆశ్చర్యపడి అడిగాను. నా సమ్ము ఖంలో వారికింత ఆనందం కలగడం ఆశ్చర్యంగానేవుంది మరి.

'చూశావా దాని హొయలు, వేషాలు! రమేష్‌గాణ్ణి పిచ్చివాణ్ణిచేసి ఆడిస్తూంది ... ఒక్క మరిదేమిటి ... ఇంకా ఎందరో ... అదంతా ఫాషన్, నాగరికత, సోషల్, లివింగ్‌ల పేరట, ఒక్క ముక్కతో కొట్టిపారేస్తుంది, అదేమంటే!...'

ఏం లోకమో! ఏం మనుష్యులో!

అయోమయంగా అయిపోయాను. ఏమిటీ జీవితాలు? ఎక్కడ మొదలై, ఎక్కడ అంతమౌతున్నట్లు ? ఎవరేం సాధిస్తున్నారు? ఏమిటో ఇదంతా ?

మరి నా బ్రతుకేమిటి ?

కాలికి ఏదో మెత్తగా తగిలింది. ఉలిక్కిపడి చూచాను! గతాన్ని గురించి తెరలు తెరలుగా కనిపిస్తున్న దృశ్యాలు మాయమయ్యాయి. చుట్టూ చూచాను. చీకటి దట్టంగా వ్యాపించి ఉంది. పైన నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. వాచీకేసి చూచాను. తొమ్మిది కావొస్తోంది. అబ్బ! ఈ మాలతీలత దగ్గిర ఏవేవో ఆలోచిస్తూ, రెండు గంటల కాలం గడిపానన్నమాట! వెనుదిరగబోయాను. ఎందుకో మనస్కరించలేదు. అడుగులు ముందుకే పడ్డాయి. గుడిసెలో గుడ్డి దీపం వెలుగుతూంది! సంకోచిస్తూనే వెళ్ళి ఆగిపోయాను.

'మాంవా! అబ్బ! సంపేత్తున్నావురా ... వదులు మాంవా! దణ్ణంపెడతాను.' లచ్చ్మి కంఠస్వరం.

పోలాయ్ చిలిపి నవ్వు గుడిసెలో ప్రతిధ్వనిస్తూంది.

'ఎన్నెలయినా, ఆడదయినా అనుబయిత్తేనే అందమే, లచ్చ్మి! అందుకే అడయిగాచిన ఎన్నెలంటారు పెద్దోల్లు...'

'చాల్లే మాంవా, అనుబయించడమంటే ఇట్టేనా? ఒల్లు హూనం అయ్యేట్టా?' చిరుకోపం ప్రతిధ్వనించింది లచ్చ్మి కంఠంలో.

'నిజంగా సెప్పే, లచ్చ్మి! పాపం, బుగ్గ నెప్పెట్టిందా? గుండె.....'

గబుక్కున చెవులు మూసుకున్నాను. పోలాయ్ లక్ష్మిని ఆపాదమస్తకం వర్ణిస్తూ, లాలనగా అడుగుతున్నాడు.

'ఫో మాఁవా! నీతో ఏం సెప్పినా సిక్కే! అట్టా బాధ పడతావెందుకూ? లేదులే...తమాషాకన్నాను - అట్టాగాని ఇడిసిపెట్టనని...'

'నా బంగారు కొండే! ఈ తేపనుంచి మెల్లిగా ఇట్టా, ఏం... ఛల్లగా లక్కుంటాలే, సరా'

'మాఁవా!'

'లచ్చీ!'

వాళ్ళిద్దరి కంఠాలలో పొంగులువారుతున్న ఆ అనురాగం వింటూ, ఆ దృశ్యాన్ని సులభంగా ఊహించుకో గలిగాను

మెల్లిగా వెనక్కి తిరిగి వచ్చేశాను. అలికిడి అయితే బహుశః వాళ్ళిద్దరు కలవర పడవచ్చు.

కాత్యాయని, విమల, లక్ష్మి, నేను, మా సంసారాలూ! ఎంత తేడా! దీన్నేమనాలి? సృష్టివిచిత్రా లనాలా? కర్మ ఫలితాలని సరిపెట్టుకోవాలా?

పరిమళభరితమైన గులాబిచుట్టూరా ముళ్లు! ఆయుష్షు అత్యల్పం! పరిమళశూన్యమైన బోగన్ విల్లా ధీమా ఎలాంటిదో?

క్షణకాలమే బ్రతికినా ధూళిధూసరితమయ్యే పారిజాతం సువాసన దేనికుంది? ఎందుకు కొరగాని గడ్డిపూలు శివుని పూజకు పనికివస్తాయి! చిత్రంగా లేదూ?

కారు గేటులోంచి దూసుకువస్తోంది. గబగబా లోపలికి వెళ్ళాను. పోలాయ్ పరిగెత్తుకువచ్చాడు. పోలాయ్, డ్రైవరు, మరెవరో ఇద్దరు కలిసి, వారిని మోసుకు వస్తున్నారు. వెనకనే డాక్టర్ ప్రతాప్‌కుమార్ వస్తున్నారు. గుండె ఝల్లుమంది. ఏమయ్యింది వారికి?

రూంలో పడుకోబెట్టారు.

'ఏమిటి డాక్టర్?' గాభరాగా అడిగాను.

క్లబ్బులో స్పృహతప్పి పడిపోయారు! మా డిస్పెన్సరీకి తీసుకువెళ్ళి ఇంజెక్షన్స ఇచ్చాను. బహుశః ఓ అరగంటలో తెలివి రావచ్చు...'

'ఇంతకీ జబ్బేమిటి, డాక్టర్?' ఆత్రంగా అడిగాను.

'జబ్బా?' సంకోచిస్తూ చుట్టూ చూచారాయన. పోలాయ్‌ని, డ్రైవర్ని, మిగతావాళ్ళిద్దర్ని బయటికి పంపేశాను.

'నిస్సంకోచంగా చెప్పండి, డాక్టర్!

'గాస్ట్రిక్ ట్రబుల్. లివర్ ఎఫెక్ట్ అయింది! ఇక అతిగా తాగటం మంచిదిగాదు. కాస్త చెడు స్నేహాలుకూడా తగ్గించకపోతే......'

ప్రతాప్‌కుమార్ ఆగాడు.

తల పగలకొట్టుకుని చద్దామనిపించింది.

'మరోసారి ఇలాటి "ఎటాక్" వస్తే ప్రమాదం!...
ప్రతాప్‌కుమార్ హెచ్చరించాడు.

వారు మెల్లిగా కదిలారు. కళ్ళెత్తి చూచారు.

'కదలకండి. రెస్టుగా పడుకోండి! ఇక ఇలా తిరగడం మానెయ్యాలి! డాక్టర్‌గా సలహా ఇస్తున్నాను.' ప్రతాప్ కుమార్ కంఠస్వరంలో కఠినత్వం స్పష్టంగా వినిపించింది.

వారు పలకాలేదు, ఉలకాలేదు!

మందులు వ్రాసి యిచ్చి, ఎలా వాడాలో చెప్పి, వెళ్ళి పోయారు డాక్టర్. కారులో డాక్టర్ని దిగబెట్టి రమ్మని డ్రైవరుతో చెప్పి వచ్చేశాను.

వారలాగే చూస్తూ పడుకుని ఉన్నారు...

'చూడండి, ఇప్పటికయినా నా మాట వినండి. వేళకి భోజనం, నిద్ర లేకపోవడమే కాకుండా దుర్వ్యసనాలన్నీ అలవరచుకున్న ఫలితం! మీ వొళ్ళెంత పాడయిపోయిందో చూశారా?' కళ్ళ నీళ్ళు పొంగివచ్చాయి నాకు.

'చాల్లే! అవకాశం దొరికిందికదా అని, మళ్ళీ పుంజుకున్నావ్! నా ఆరోగ్యం సంగతి, నా శరీరం సంగతి, నా మంచిచెడుల సంగతి నాకు తెలుసులే! నీ సలహా లక్ఖర్లేదు!' గర్జించారు...అంతలోనే నీరసమో, ఏమో, వెనక్కి వాలి పోయారు మగతగా.

ఇప్పుడు కొద్ది కొద్దిగ కోలుకుంటున్నారు. డాక్టర్లు పెట్టిన కట్టడివల్ల, ఒంట్లో ఓపిక లేనందువల్ల వారు యింటి పట్టునే ఉండిపోతున్నారు. కానీ, నాకేదో భయం...ఏవేవో సంశయాలు...

భవానీ ! ఇప్పుడు చెప్పు ! ఇద్దరి కిద్దరమూ బంగారు పిచికలమే! ఏ విషయంలోనూ కొరతలేదు... కానీ ఈజీవిత మార్గం యింత వక్రంగా వుం దేమిటి ? ఇంత దుర్భేద్యంగా ఉం దేమిటి ? ఎందుకో నాకే అంతుబట్టడం లేదు !

సరే, నా గొడవలా పోనీయ్ ! నీ కీ మధ్య కళ్యాణి దగ్గిరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా ? నాకు కూడా వ్రాయటంలేదు. కాని, మనం స్కూల్ ఫైనల్ చదివే టప్పుడు మనకు. సైన్సుకు వచ్చేది టీచరు...సులోచనా దేవి.. ఆవిడ యీమధ్య యిక్కడికి వచ్చింది. షాపింగ్ కు వెళ్ళితే అనుకోకుండా కనిపించింది. చాలాసేపు మాట్లాడింది.మాటల సందర్భంలో తను గుంటూరులోనే ఉంటున్నానని చెప్పి కళ్యాణి సంగతికూడా చెప్పింది. అదివాళ్ళాయనతో పోట్లాడి ఇంచుమించు తెగతెంపులు చేసుకుని వచ్చేసిందట ! ప్రస్తుతం కాళ్యాణి, వాళ్లమ్మా, నాన్నలదగ్గిరగుంటూరులోనేఉందిట... ఏదైనా జాబు దాని దగ్గిరనించి వస్తే వ్రాయి. అడ్రస్ తెలిస్తే వ్రాయి.

ఇక ఉంటా.

నీ
"భారతి"

కళ్లనీళ్ళు టపాటపా, రాలిపడ్డాయి. టేబిల్ మీద తల పెట్టి వాలి ఎక్కిళ్ళు పెడుతూంది భవాని.

"ఎందుకు, భవానీ ? ఏమిటి? ఏమని వ్రాసింది స్నేహితురాలు ?"

చంద్రశేఖర్ గాభరాగా అడుగుతూ భవానిని తన వేపు తిప్పుకున్నాడు.

అతని గుండెలమీద తల ఆన్చి, బావురుమంది భవాని. అతడామె తల నిమురుతూ నిలుచుండిపోయాడు. భావకం దని వేదనతో సతమతమై పోతున్న భవాని దుఃఖం ఎంత సేపటికో గాని తగ్గలేదు.

*　　*　　*　　*

సినిమాలో ప్రణయ సన్నివేశం జరుగుతూంది. నాయకీ నాయకులు కని విని ఎరగని రీతుల్లో శృంగారభావాలు నట నల్లో ప్రదర్శిస్తూ. వింత చేష్టలు చేస్తున్నారు. నాయకి వక్షస్థలం మీద అందాకా ఉల్లిపొరలా రెప రెపలాడుతున్న 'పమిట' అన బడే వస్త్రం, హీరో హస్తలాఘవంతో పూర్తిగా తొలగింప బడింది! సిగ్గు ప్రదర్శిస్తున్న ఆ సినీతార అంగవిన్యాసానికి, అవయవ సౌష్ఠవానికి ముగ్ధులైన ప్రేక్షకులు, ఇక తమనుతాము సంబాళించుకోలేక, చప్పట్లు, ఈలలు, గంతులు వగైరాలతో ఆనందాన్ని వెల్లడించుకుంటున్నారు. కళ్యాణి పక్కన కూర్చున్న యువకు డెవరోగాని సినిమాలో ఐక్యమైపోయి, తటాలున ఆమె చెయ్యి నొక్కివేశాడు. "మార్వెలస్" అంటూ!

మొదటినించి అర్థం లేని ప్రణయకలాపాలతో, పాటలతో, పిచ్చిగంతులతో సాగుతున్న ఆ సినిమా అప్ప టికే విసుగు, తలనొప్పి అనుగ్రహించింది. అది చాలదన్నట్లు ఈ ఘనుడి వెర్రి వేషాలు. కోపంతో పళ్ళు కొరుక్కుని, ఛర్రుమంది కళ్యాణి!

"ఏయ్ మిస్టర్! కాస్త ఒళ్ళు దగ్గిర పెట్టుకో" అంటూ అరిచింది.

"సారీ! కోప్పడకండి! ఏదో ఉద్రేకంలో!" అత గాడి ముఖము, నవ్వు, మాటలు, పశ్చాత్తాప ధోరణిలో లేవు. వెకిలిగా, వెగటుగా ఉన్నాయి.

కళ్యాణి చుట్టూ పరకాయించి చూచింది. అసలింత రద్దీగా ఉన్నపుడు, పిక్చరు వచ్చి వారంరోజులు కూడా కాక ముందే రావడం తనదే తప్పు! అదీగాక, ఆలస్యంగా వచ్చింది. తీరా టిక్కెట్టు తీసుకుని లోపలికి వచ్చిచూస్తే మధ్యలో ఒక్క సీటు ఖాళీగా ఉంది. గేట్ కీపరు టార్చివేసి చూపించి, "అక్కడ కూర్చోండి!" అన్నాడు. ఇష్టంలేకున్నా తప్పలేదు

ప్రతి శృంగార సన్నివేశంలోను చుట్టుపక్కల మగ వాళ్ళు భార్యాభర్తలు చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు దుర్భరంగా ఉన్నాయి. కాని ఏం చేస్తుంది తను? కనీసం నాన్నతోబాటు వచ్చినా బాగుండేది. ఆయన్ను కదిలిస్తే "మరో నాలుగు రోజు లాగమ్మా! కాస్త రద్దీ తగ్గుతుంది. వెళదాం!" అన్నారు.

ఏమీ తోచకుండా గోళ్ళుగిల్లుకుంటూ ఎలా కూర్చోవడం? తను బయలుదేరితే వద్దనలేదు నాన్న, అమ్మ!

మళ్ళీ మెల్లిగా కాలుమీద కాలుపెట్టి నొక్కాడు పక్కయువకుడు. తటాలున లేచి, మెల్లిగా అందర్నీ తప్పించుకుంటూ బయటికి వచ్చేసింది కళ్యాణి.

"ఏమయ్యా కళ్యాణీ? అప్పుడే వచ్చావేం? సినిమా వదిలేసరికి హాలు దగ్గరికి వద్దామనుకుంటున్నాను."

"పిక్చరేం బాగా లేదు నాన్నా!" అంటూ లోపలికి వెళ్ళింది కళ్యాణి.

చల్లటి వెన్నెల హాయిగా వుంది. పక్కకు తిరిగి చూచింది కళ్యాణి! తల్లి, తండ్రి ఇద్దరూ మాంచి నిద్రలో ఉన్నారు.

ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడంలేదు కళ్యాణికి. ఏమిటో గతమంతా వద్దన్నా పైకి వస్తోంది.

తను, భారతి, భవాని, స్కూలుకు వెళుతూంటే, కలిసి వస్తూంటే, కొందరు కొంటె కుర్రాళ్ళు అరుస్తూండేవాళ్ళు. సరిగ్గా మలుపులోకి వచ్చేసరికి, అక్కడేవున్న కిళ్లీకొట్టులో కూర్చుని ఉండేవారు ముగ్గురు రోమియోలు.

"ఒరేయ్! అదిగో, త్రివేణి సంగమం కదిలివస్తోంది రోయ్!"

"ఆ ఎడంచేతివేపున్న చివరి శాల్తీ పేరు యమునో, జమునో, అయివుంటే బావుండేది! మూడు నదులపేర్లు సరిపోయేవి!" మరో శతమర్కటం సలహా!

"ఇప్పుడు మాత్రం తక్కువేమయింది? ఒకరు చామన చాయగా అంతర్వాహినిలా, మరొకరు పచ్చగా, ఇంకొకరు తెల్లగా...ఆహాహా! ఏం పర్సనాలిటీ! ఏం బ్యూటీ! బ్రహ్మకైనా బుట్టు రిమ్మ తెగులు!" మూడో వెధవ కవిత్వం!

"మన మిలా కలిసి రావొద్దే కళ్యాణీ! లేదా మా కారులో వెళదాం ముగ్గురం...మీ కోసమే గదూ నే నడిచి వస్తూంట?" భారతి అన్నది ఒకరోజున.

"ఛ, ఛ! నీకు పిరికిపా లెక్కు వే, భారతీ! ఎవరో వెధవలు ఏమో వాగారని మనం భయపడితే, మరింతగా చులకనై పోము? నీకు కష్టంగా ఉంటే, కలవారి పిల్లవు. కారులో వెళ్ళు. నేను మాత్రం నీ కారులో రాను. నువ్వేమంటావే, భవానీ?" కళ్యాణి చాకులా సమాధానం చెప్పింది.

భవాని ఎటూ చెప్పలేక సందిగ్ధంలో పడింది.

ఇంతలో మరో అబ్బాయి సైకిల్ మీద వెళుతూ,

"త్రివేణీ సంగమం" అంటూ కేకేసి వెళ్ళాడు.

'ఇంకేం చలి తీరిపోయింది! పేరు స్థిరపడిపోయాక భయమెందుకు?"

కళ్యాణి మొండి ధైర్యానికి మిగతా ఇద్దరూ విస్తుపోయారు.

మార్కులు అలాగే వచ్చేవి. ఫస్టు, సెకండ్, థర్డ్ రాంక్ లు ఆ ముగ్గురిసొత్తు! సులోచనా దేవి నవ్వుతూ అంటూండేది: "భలేవాళ్ళమ్మా మీ ముగ్గురూ! ఇంత చక్కటి స్నేహితురాళ్ళని నే నెక్కడా చూడలేదు!"

స్కూల్ ఫైనల్ పూర్తి అయింది. పరీక్షలు వ్రాసీ వ్రాయకముందే తన పెళ్ళి సుధాకర్ తో జరిగింది.

అత్తవారింటికి వెళ్లేరోజున భారతి, భవాని ఇద్దరు కళ్ళలో నీళ్ళు నించుకున్నారు. "కల్యాణీ! ఎక్కడున్నా, ఎలా వున్నా ఉత్తరాలు వ్రాస్తుంటావుకదూ? మన స్నేహం మాత్రం విచ్ఛిన్నం కాగూడదే" భవాని అంది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

భారతి మెల్లిగా అంది—"నీకు తొందర, మొండితనం ఎక్కువ కల్యాణీ! జాగ్రత్తసుమా! నా పెళ్ళికూడా మా బావతో నిశ్చయమైందిగా! తప్పక వస్తావు కదూ? నా పిచ్చి గానీ...ఇక నీ యిష్టమేముంది? మీవారు, మీ అత్తగారు వాళ్ళంతా అనుమతిస్తే కదా? అయినా జాబులు మాత్రం వ్రాస్తావు కదూ?"

"అల్లాగే!" కల్యాణి హృదయం బరువెక్కిపోయింది.

నిన్నటివరకు తను చలాకీగా స్కూలుకు వెళ్ళివచ్చే విద్యార్థిని. ఈ రోజు బాధ్యతాయుత గృహిణి. భర్త. అత్త గారు, అడబిడ్డ, మరిది, సంసారం, ఆర్థిక వ్యథలు, సమస్యలు, కలతలూను! ఓహ్! తలకు మించిన బరువు!

కాని తనుమాత్రం తప్పేంచేసిందని?

అస్తమానం ఏదో ఓ పని. కాస్సేపయినా, తను, సుధా కర్ కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకోడానికి లేదు. చెకింగ్ ఆఫీసర్లలా అత్తగారు, మీనాక్షి, మరిది ప్రభాకర్! ఏరాత్రికో గదిలో చేరితే, ఇంటి సమస్యలు, ఆర్థిక బాధలే చర్చనీయాంశాలు కావడం, ఏదో ఓ చిన్న విషయంలో ఇద్దరి అభిప్రాయాలు

చౌకీదారి కావడంతో మాతులు ముడుచుకొని పడుకోవడం పరిపాటి అయింది.

హాయిగా తను, సుధాకర్ వేరుగా ఉండివుంటే? స్వర్గంలా ఉండేది? ఇక ఎప్పుడో ప్రభాకర్ చదువు పూర్తవుతుంది. ఎప్పుడో మీనాక్షి మొగుడుకి ఉద్యోగం వచ్చి, అతగాడా అమ్మాయిని వెంటబెట్టుకొని వెళతాడు. మరెప్పుడో అత్తగారికి చావు వస్తుంది. ఎప్పుడో అప్పులు తీరుతాయి. భవిష్యత్తును గురించి లేనిపోని ఆశలు పెంచుకోడం వినా, మరే ఆనందము లేదు. ఈ లోపల ఆయుష్షు తీరిపోతూనే ఉండె! ఇక ఎప్పుడు సుఖం?

తను ఇలాంటి దాంపత్య జీవితాన్ని ఎప్పుడు కలలో కూడ కోరలేదు. ఇదేమంటే, అన్నిటికి, "ఓర్పు వహించు, కళ్యాణీ! నా వాళ్లు, నా కోసం ఎన్ని కష్టాలు పడ్డారో నీకు తెలుసా? మీనాక్షి సంవత్సరం పిల్లగా ఉన్నప్పుడు నాన్న చనిపోయారు! మా మామయ్య, వాళ్ళ చేత ఎన్ని మాటలో పడుతూ, ఎన్ని అవమానాలో పొందుతూ, ఎలాగో అలాగ, నాన్న మిగిల్చిపోయిన ఆస్తి సాయంతో అమ్మ మమ్మల్ని పెంచి పెద్దవాళ్ళని చేసింది. ఎలాగో నాకు చదువు సంధ్యా వచ్చి, కాస్త, మనిషినయ్యాను! ప్రభాకర్, మీనాక్షి, అమ్మల బాధ్యత నాకు లేదంటావా? కేవలం మన సుఖం కోసం వాళ్ళని విడిచిపెట్టడం న్యాయమని అనగలవా!" అంటూ సోది మొదలెడతారు!

"విడిచిపెట్టమన్నానా ? కావలసిన డబ్బేదో నెలనెల 'ఇంత' అని యివ్వండి ! మనం కాస్త దూరంగా స్వేచ్ఛగా ఉందాం !

మాట పూర్తి చెయ్యకుండానే చిందులు తొక్కుతా రాయన.

"నాకేం వేల లెక్కలో వస్తూందా ఆదాయం వచ్చే స్వల్పాదాయంలో అందరము ఒక్కచోట ఉంటేనే జరగడం కష్టంగా ఉంటే, ఇక విడివిడిగా వేరువేరు కుటుంబాలు పెట్టి 'మేనేజ్' చెయ్యడం ఎంత బాధో ఆలోచించావా ? నువ్వు ఎన్నిఅయినా చెప్పు, కళ్యాణీ! నీ కోసం సర్వస్వాన్ని అర్పించుకోగలను. కాని, నా వాళ్లని మాత్రం విడిచిపెట్ట లేను ! ఆపైన నీ ఇష్టం"

అభిమానం దెబ్బతింటుందనేనా ఆలోచించకుండా, అంత స్పష్టంగా చెబుతూంటే, ఇంకా అక్కడ ఎలాగ ఉండడం ?

అత్తగారి కెప్పుడూ తన అధికారం చలాయించాలన్న ధ్యాసేగాని, కోడలికి కూడా ఓ వ్యక్తిత్వముంటూ వుంటుం దనే ఊహే పోదు.

మీనాక్షి సరేసరి. మా అన్నయ్యలు నాకు పెడు తూంటే, మధ్య నువ్వెవరు మాట్లాడడానికి ?" అనే తీరులో మాట్లాడుతుంది. ఇప్పుడే ఇంత దుబారా ఖర్చుచేసే ప్రభాకర్ తరువాతేదో ఉద్ధరిస్తాడనుకోవడం అవివేకం.

వెంటనే తను "మొన్న నేను, వారు పెడతామంటే, అలా గింజుకున్నా రెందుకూ? ఈరోజుమాత్రం డబ్బు తగల బడిపోవడంలేదా? అని అనగానే ఇల్లు రణరంగంగా మారిపో తుంది!

ఛీ!......వెధవకొంప! వెధవ సంసారం! ఇక క్షణం అక్కడ ఉండలేదు తను ఆయన తనని వదిలి ఉండలేరు. బాగా తెలుసు! అందుకే కొన్నినెలలు ఇటు రాకుండా, అమ్మా నాన్నల దగ్గర ఉంటే, వారే వచ్చి పిలుచుకు వెళతారు! వేరు కాపరం పెడతారు. అందాకా నేను వెళ్ళను! వెళ్ళ కూడదు!...

అంతే. చక్కా రైలెక్కి వచ్చేసింది!

అమ్మ, నాన్న ఎలా గ్రహించారో, ఒకటే ప్రశ్నల వర్షం!

"తప్పమ్మా! అలాఅనకూడదు. అతనితో తెగ తెంపులు చేసుకోవడమేమిటి? పిచ్చిపిల్లా! నీ కంతగా మనసు బాగా లేకపోతే నెలరోజులుండి వెళుదువుగాని..." అమ్మ ధోరణి.

"మెల్లిగా సరిదిద్దుకోవాలిగానీ, అమ్మా! ఇలా తొందర పడతారా, తల్లీ!" నాన్న మందలింపు.

"మీ ఇద్దరికి నేనంత బరువుగా వుంటే కాస్త విషం పుచ్చుకుని చస్తానులెండి..." తనకోపం యిద్దరిమీద బాగానే పనిచేసింది. మరి ఆ ప్రసక్తి తేవడంలేదు.

"ఇంకా నిద్రపోలేదుటే, కల్యాణీ?"

తల్లి సంబోధనతో ఉలిక్కిపడి, గబుక్కున కళ్ళు మూసుకుంది కల్యాణి. కానీ, చెవుల్లో సైరన్ మోత రింగులెత్తుతూంది!

*　　　*　　　*

జాబు యెవరి దగ్గరనుంచి వచ్చిందో తెలుసుకోవడం ఏమంత కష్టమనిపించలేదు కల్యాణికి. సుధాకర్ వ్రాసిందే.

గబగబా చింపింది.

''డియర్ కల్యాణీ,

ఇలాంటి ఉత్తరం నీకు వ్రాయవలసి వస్తుందని నేనాడు అనుకోలేదు కానీ, వ్రాస్తున్నాను. మా మీనాక్షి భర్త న్యాం ట్రెయిన్‌లో వస్తూ ప్రమాదానికి గురిఅయి చనిపోయాడు... మీనాక్షి పరిస్థితేమిటో నేను వర్ణించలేను. కానీ, పిచ్చిదయి పోయింది. అమ్మ మంచమెక్కింది దిగులుతో.

మానవు లనుకునేవన్నీ జరిగితే. ఇక ప్రపంచంలో సుఖాలు, దుఃఖాలు మచ్చుకు కూడా ఉండవేమో ? మీనాక్షిని కాస్త దుఃఖం మరిచిపోగానే, టీచర్ ట్రెయినింగ్‌లో గాని, నర్సింగ్ కోర్సులోగాని చేర్చాలనే నిర్ణయానికి వచ్చాము నేను ప్రభాకరమూను. నువ్వీ ఇంటి పెద్దకోడలివి. నీకీ యింటితో, ఇందులోని సమస్యలతో ఎంతో సంబంధము, బాధ్యత కూడా ఉన్నాయి. జీవితాంతం పంతాలు, పౌరుషాలతో సాధించగలిగిందేమీ లేదు. ఈసమయంలో అమ్మకు, మీనాక్షికి ఊరట కావాలి. స్త్రీగా, ముఖ్యంగా నా భార్యగా నువ్వు వారి కా

సాంత్వనం ఇవ్వడం ఉచితం. విశాలహృదయంతో పరిస్థితుల్ని అర్థం చేసుకుని వివేకంతో ప్రవర్తిస్తావని ఆశిస్తున్నాను.

నీ

సుధాకర్."

గాఢంగా నిట్టూర్చింది కల్యాణి.

"ఏం వ్రాశాడే మీ ఆయన?" తల్లి ప్రశ్నకు తలతిప్పి చూచింది.

"ఏముందమ్మా! మా మీనాక్షి భర్త శ్యాంచనిపోయాడుట..." ముక్తసరిగా జవాబిచ్చింది.

"అయ్యో! రమ్మని వ్రాశాడా?" మళ్ళీ ఆత్రంగా అడిగింది.

"ఆయనేం వ్రాయలేదు. మీరే నెట్టిపంపేలాఉన్నారు నన్ను!" చరచరా పక్కగదిలోకి వెళ్ళిపోయింది కల్యాణి.

*　　*　　*

"భారతీ!"

"......"

"భారతీ!"

"వస్తున్నానండీ! ఏం కావాలి?"

"ఇదేమిటి? నిల్చోలేకపోతున్నాను! ఈ చెయ్యికూడా పైకి లేవటంలేదు!" ఆనంద్ కంఠస్వరంలో ఆందోళన, భయం తొంగిచూస్తున్నాయి.

భారతి నెత్తిన పిడుగుపడ్డట్లయింది. భర్త దగ్గిరికి పరిగెత్తుకు వచ్చింది. లేచి నిల్చోబోయి మళ్ళీ మంచం మీదే కూలబడిపోయాడు ఆనంద్.

"నెలరోజులుగా మంచంమీదే ఉండడంవల్ల, కాళ్ళు తిమ్మిరెక్కి-యి కాబోలు! నేను సాయంపడతాను, లేవండి!"

భారతి ఆనంద్‌కు ఆసరాగా నిల్చుంది.

"ఊహుఁ, కదల్లేకపోతున్నాను, భారతీ! నాకేమిటో భయంగా ఉంది! డాక్టర్ కి ఫోన్ చెయ్యి!" నిస్పృహగా, నిస్సహాయంగా పడిపోయాడు ఆనంద్.

అరగంటలో డాక్టర్ ప్రతాప్‌కుమార్ వచ్చాడు.

"ఏమిటి, డాక్టర్?" కంగారుగా అడిగింది భారతి.

"పెరాలిసిస్!"

"అంటే?" భారతి భయ విహ్వాల అయి, అరిచిన అరుపు గదిలో మారు మ్రోగింది!

"పక్షవాతం!" ప్రతాప్‌కుమార్ కంఠస్వరం వణికి పోతూంది.

"నిజంగానా, డాక్టర్? నాకు పక్షవాతం వచ్చిందా? ఇక లేవలేనా? లేచి తిరగలేనా?" ఆనంద్ దాదాపు రోదిస్తూ అడిగాడు.

"మందులు వాడతాను."

డాక్టర్ మాటలకు అడ్డువస్తూ అంది భారతి, "పోనీండి! మరెక్కడికి వెడితే నయమౌతుందో చెప్పండి! ఎంత ఖర్చయినా ఫరవాలేదు! తీసుకువెళతాను." ఆమె కంఠస్వరంలో ఆందోళన, ఆవేదన, దృఢనిశ్చయము స్పష్టంగా వినిపించాయి ఆనంద్ కు.

"ఆత్మస్తుతి అనుకోకుంటే ఒకటి చెబుతాను. ఎలాంటి ప్రమాదభరితమయిన కేసులయినా నయం చెయ్యగలను నేను, చేశాను. నా శక్తివంచన లేకుండా ప్రయత్నించి చూస్తాను. నామీద నమ్మకం లేకపోతే, మీ ఆత్మతృప్తికోసం మరెక్కడికయినా వెళ్ళాలనుకుంటే నా కభ్యంతరం లేదు. కాని, ఇవే మందులు, ఇదే ట్రీట్ మెంటు. ఆనంద్‌గారు మళ్ళీ నడవగలగడం మాత్రం దుస్సాధ్యం! శరీరం పూర్తిగా శిథిలమైపోయింది!" డాక్టర్ స్పష్టంగా చెప్పాడు.

"అంతేనంటారా?" వెర్రిగా చూస్తూన్న ఆనంద్ ఒక్కసారిగా పెద్దగా ఏడవడం మొదలెట్టాడు.

భారతి సజీవ శిల్పంగా నిలుచుండిపోయింది.

"ధైర్యం వహించాలి మీరిద్దరూ! నా శాయశక్తులా ప్రయత్నిస్తానంటున్నాను కదా?"

డాక్టర్ వెళ్ళిపోయాడు. చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న భారతిని దగ్గిరికి పిలిచాడు ఆనంద్.

"భారతీ!"

"ఏమిటండి?"

"అలా అనకు. నన్ను, 'బావా' అను."

హఠాత్తుగా వచ్చిన యీ మార్పుకు విస్తుపోయింది భారతి.

"అలాగే!"

"నాకు పక్షవాతం, అంటే ఇది యిక నయం కాని జబ్బు! కుడికాలు, కుడిచెయ్యి కదపలేక పోతున్నాను. ఇక నా జీవితం ఎలా జరగాలి, భారతీ!"

ఆనంద్ కన్నీళ్ళు ఆగకుండా ప్రవహిస్తున్నాయి.

"అంటే మీ భయమేమిటో?" భారతి మెల్లిగా అతడి తల నిమురుతూ అడిగింది.

"నా వయస్సు చాలా తక్కువే. కానీ వయస్సుకు మించిన సుఖాన్ని ఒక్కసారిగా జుర్రేయ్యాలనే తాపత్రయంతో, గర్వం కలిగించిన భరోసాతో, ఒళ్ళు తెలియకుండా ప్రవర్తించాను, భారతీ. చివరకి గతి పట్టింది. నిన్నే నాడూ సుఖపెట్టలేదు. బహుశః నీహృదయంలోని ఆవేదనే, ఇలా శాపంగా నాకు పరిణమించిందేమో? ఇక నా గతేమిటి?" ఆనంద్ పసిపిల్లాడిలా ఏడుస్తున్నాడు.

"మీ మనసులో మాటేమిటో నాకు తెలుసు. మీలో రాదనుకున్న మార్పు వచ్చింది. అదే చాలు నాకు. మిమ్మల్ని నా కంటిపాపలా కాపాడుకుంటాను. సరా! నా మీద విశ్వాసం లేదా?" భారతి కన్నీళ్ళతని హృదయాన్ని తడిపి వేస్తున్నాయి.

"భారతీ! ఇదే కాబోలు! దగ్గిర ఉన్న మాణిక్యాన్ని గుర్తుపట్టలేక, దూరానున్న గాజుపెంకుకోసం పరిగెత్తాడుట వెనకటి కెవరో! ఇక నేను నడవలేనంటావా?"

"నడుస్తారు! తప్పక నడుస్తారు! మీ జబ్బు ఇట్టే నయమైపోతుంది! కాని......"

"ఏమిటి, భారతీ?"

"మళ్లీ అధోమార్గంలో నడవకుండా ఉండగలిగితే?"

"పిచ్చిదానా! మళ్లీనా?"

ఆ ఒక్కమాట భారతికి కర్ణపేయంగా తోచింది.

*　　　*　　　*　　　*

"వదినా!"

"ఏం, విమలా?"

"నిన్ను చూస్తూంటే నాకు జాలి, కోపము కూడా వస్తున్నాయి."

భారతి మెల్లిగా నవ్వింది.

"కోపం రావడానికి కారణమేమిటో బోధపడడంలేదు."

"ఆనంద్ అన్నయ్య ఇంకా బాగుపడతాడనే నమ్మకం ఉందా నీకు? సంవత్సరం దాటిపోయింది మంచంలో పడి. రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మాని సపర్యలు చేస్తున్నావ్. నీ శరీరంలో ఎంత మార్పోనీకు తెలుసా?" విమలకళ్లు మరింత పెద్దవిగా చేస్తూ అడిగింది.

''ఎంత మార్పు?'' భారతి అలాగే ఏమీ తెలియ నట్లే అడిగింది.

''ఒక్కసారి అద్దంలో చూచుకో. నీకే తెలుస్తుంది. కళ్ళు పీక్కుపోయి, ముఖం పాలిపోయి, సన్నగా పీలగా, పేలవంగా...ఒక్కమాటలో చెప్పాలంటే అస్థిపంజరంలా.''

భారతి కిలకిల నవ్వింది. ''...జీవచ్ఛవంలా, జెండా కర్రలా, పీకులా...''

విమల ముఖం ముడుచుకుంది. ''వేళాకోళం చేస్తు న్నావు! నిజంగానే అలా ఉన్నావు. ఈ నీ సేవకు, ఇలా నువ్వు శిథిలమై పోవడానికి అర్థంలేదు, వదినా. ఒక వస్తువు మంచిదనీ, మనకి ఉపయోగిస్తుందనీ నమ్మకమున్నపుడు, ఆ వస్తువుకోసం అహర్నిశమూ శ్రమపడడంలో వివేకముంది కాని, ఎందుకూకొరగాని పదార్థంకోసం జీవితాన్ని బలిపెట్టు కోవడంలో అర్థంలేదు.'' గంభీరోపన్యాసం ఇచ్చింది విమల.

''మరి ఉండేలా ప్రవర్తించడమంటే నీ ఉద్దేశంలో ఏమిటో కాస్త చెబుతావా, విమలా?'' భారతి స్థిమితంగా సోఫాలో కూర్చుంది.

''అలా అడిగావ్, బాగుంది! అయితే ముందు ఊరికే చెప్పుకుంటూ పోయేకంటే వివరంగా చెబుతాను. వింటావు కదూ?''

''వింటాను.''

''ఆనంద్ అన్నయ్య ఏనాడూ నిన్ను సుఖపెట్టలేదు. అదలాఉంచు. వచ్చిన జబ్బు తిరుగులేనిదయింది. పోనీ, ఆస్తి

అయినా ఉంచాడా అంటే, అప్పులకిపోను మిగిలింది బంగళా, కొద్దిపాటి డబ్బు మాత్రమే. నీకు కాస్త అండగానైనా ఉంటాడనుకొంటే, మీ మామయ్య చనిపోయాడు. ఇక నీకు ఆనంద్ మిగిల్చిందేమిటి? ఇచ్చిందేమిటి?'' విమల తీవ్రంగా అడిగింది.

''అయితే భర్త భార్యకు విధిగా ఆస్తి, సుఖము, సంతోషము ఇవ్వాలంటావు?'' భారతి మెల్లిగా అడిగింది.

''లేకపోతే? శారీరికంగా స్త్రీకికూడా పురుషుడికిలాగే కోర్కెలుండవా? ఏది చూచుకుని నువ్వు సంతృప్తిపడతావు? శారీరిక సుఖాల ఆశ యికలేదు! ఇంత క్రితమూ లేదనుకో. ఆస్తి అంతంతమాత్రమే అయింది. పోనీ, నువ్వు కాస్తచొరవ గలదానివా? అంటే అదీలేదు. ఏవో ధర్మాలు, నియమాలు అంటూ ముక్కుమూసుకుని కూర్చుంటావు. ఇలా నీ జీవితం ఎంతకాలం సాగాలి? పాతికేళ్ళు మాత్రం గల నువ్వు, జీవితాంతం ఎడారిలాంటి జీవనమార్గంలో సాగగలవా? చెప్పు, వదినా? ఏం చూచుకుని నువ్వు యిలా ప్రవర్తిస్తున్నావో కాస్త చెప్పు.''

విమల తన పని అయిపోయినట్లు, చేతులు ములుపుకుంది.

''నీ అభిప్రాయమేమిటో మరింత స్పష్టంగా చెప్పావు మరోసారి. కృతజ్ఞురాలిని. కేవలం శారీరికమయిన సుఖాన్ని నేనెప్పుడు వాంఛించలేదు వారినుండి వారి హృదయాన్నే కోరాను. అది నాకు లభ్యమయింది. వారు నన్ను గుర్తించారు. మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నారు. నిశ్చింతగా నామీద విశ్వాసం ఉంచి, నన్నారాధిస్తున్నారు. ఇక నాకు కావలసి

దేమిటి? వారి జబ్బు నయం కావాలని వాంఛిస్తున్నాను. కాకపోతే, కాలేదే అని బాధపడను. వారికి చెయ్యి, కాలు లేకపోతే, నావి ఉన్నాయి. ఇక, ఆస్తి, డబ్బు అంటావా? అవి ఉండగా నేను పొందలేని మానసికానందం అవేవీలేకున్నా నేనిప్పుడు అనుభవిస్తున్నాను. ఆ తృప్తే చాలు నాకు. మామయ్య చనిపోయారు. అమ్మ, నాన్న నన్ను తమ దగ్గిరికి వచ్చి ఉండమని మరీ మరీ కోరారు. కాని, నా కెవ్వరూ అక్కర్లేదు. ఎవరి జాలీ, సానుభూతీ అవసరం లేదు. నా కొక్కరే భర్త, బావ, అన్నీ వారే!''

భారతి కొంచెం సేపు ఆగింది.

"అవన్నీ బాగున్నాయి, భారతీ! కానీ యివి మాట్లాడుకొనే నీతులు మాత్రమే..."

''విమలా! మాట్లాడకు. ఏం సుఖము, తృప్తి చూచుకుని నేను తృప్తిపడుతున్నానని నువ్వు హేళనగా అడుగుతున్నావు! రమేష్ అన్నయ్య నీకేం తక్కువ చేశాడు? ఏ విషయంలో నీకు లోపం ఉంది? కాని, ఆడదానివ నేగుర్తు కూడా లేకుండా నువ్వు సురేష్‌తో జరిపిన ప్రణయకలాపం కళ్ళారా చూచాను ఒక్క సురేషే కాదు. మరెందరు పురుషులతోనో నువ్వు అలాగే ప్రవర్తిస్తున్నావు. కాని ఏనాడయినా, రమేష్‌కు ద్రోహం చేస్తున్నావని తెలుసుకున్నావా? అన్ని వున్నా నీతి నియమాల్ని విసర్జించిన నువ్వు, నాభర్త యీ స్థితిలో వుంటే, వారికి ద్రోహం చెయ్యమనీ, అది తప్పు కాదనీ ప్రోత్సహిస్తున్నావా? విమలా! నేను భారతిని!

విమలను కాను! ఇంతకంటే హీన పరిస్థితిలోకి నన్ను భగవంతుడు నెట్టినా, నా శరీరం యిట్లాగే శిథిలమై పోవడమే నేను కోరుకుంటాను! అంతేకాని నీలాగ అసహ్యమైన మార్గంలో అడుగు కూడా పెట్టను! బాగా గుర్తుంచుకో!''

విమల నిశ్చేష్టురాలై కూర్చుండిపోయింది.

"నీ ఆదర్శాలకు, అంతస్తుకు, అభిప్రాయాలకు విలువ, ఆదరణ కూడా ఇక్కడ లభించవు? మంచిది. ఇక వెళ్లు.''

భారతి గబగబ పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

* * * *

కలకత్తా

"డియర్ భారతీ! 10—8—64

ఇక్కడనుంచి నేను ఉత్తరం వ్రాయడం నీకు వింతగా తోస్తూంది కదూ? అవును మరి! స్త్రీ జీవితమే తమాషా అయింది. ఆడదాన్ని ఎందుకు సృష్టించాడో భగవంతుడు! స్త్రీజీవితం ఎప్పుడూ సమస్యలతో పుట్టి, సమస్యలతో సతమతమై సమస్యలతోనే అంతమొందుతూంటుందేమో! జీవితయాత్ర సంతోషంగా, సాఫీగా సాగిస్తున్న స్త్రీలను వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు ననిపిస్తూంది నాకిప్పుడు. ఈ అర్థంకాని వేదాంత మేమిటని విసుక్కుంటున్నావా? జీవితంలో హృదయాన్ని స్పందింపజేసే నాదం లోపిస్తే మిగిలేది అంతమే.

నా దాంపత్య జీవితాన్ని గురించి, నా ఆనందాతిశయాన్ని గురించి, ఏదీ దాచకుండా నీకు వ్రాశాను, గుర్తుందా?

కానీ ఇలా వంచింపబడతానని, జీవితంలో ఇంతగా పరాజితురాలి నౌతానని కలలోకూడా గ్రహించలేదు నేను. ముఖ్యంగా చంద్రశేఖర్ ఇంత దగా చేస్తాడని నాజన్మలో అనుకోలేదు.

రెండు నెలల క్రితం, మా బాబుకు సంవత్సరం నిండి, రెండవ ఏడు వచ్చింది. ఆరోజు వారు ఆఫీసుకు వెళ్లారు. బాబును నిద్రపుచ్చి, టేబిల్ క్లాత్ మీద డిజైన్స్ కుడుతు న్నాను. మధ్యాహ్నం రెండున్నర కావస్తూందిగంట.

'చంద్రశేఖర్ గారి ల్లిదేనండి ?'

ఎవరిదో స్త్రీకంఠస్వరం వినితలెత్తిచూచాను. గేటులో యాభై సంవత్సరాలు పైబడ్డ ముసలాయన ఒకడు. ఆయన పక్కనే, పాతిక సంవత్సరాలలోపు యువతి, ఐదేళ్ళ బాబు నిల్చుని ఉన్నారు !

తెలుగువారని స్పష్టంగా తెలుస్తూంది కట్టూబొట్టూ పరికాయిస్తూంటే.

'ఇదే ! లోపలికిరండి !' అన్నానేగాని మనసు జ్ఞాపకాల పొరలను తొలగిస్తూంది. ఊహు ఎప్పుడూ చూళ్లేదు. ఎవరో గుర్తు రావడంలేదు. వారెప్పుడూ తనకు బంధువు లున్నట్లు కూడా చెప్పలేదు.

'మీరు...!' ఆ ముసలాయన ప్రశ్నించాడు.

'వారి భార్యను. భవాని నాపేరు...మీరు...?'

వాళ్ళిద్దరు ముఖముఖాలు చూచుకున్నా రెందుకో.

'నా పేరు గోపాలయ్య, మా అమ్మాయి దుర్గ, వాడు దాని బిడ్డ రవి. చంద్రశేఖర్ నిన్నెప్పుడు పెళ్ళి చేసుకున్నాడమ్మా?' ముసలాయన ప్రశ్న ఎందుకో కటువుగా వినిపించింది.

'మూడేళ్ళు దాటాయి మా వివాహమై. కూర్చోండి.'

'మర్యాదల కేంలే అమ్మా భవానీ? అతగా డెక్కడికెళ్ళాడు?'

గోపాలయ్యగారి ధోరణి వింతగా ఉంది. నన్ను ఆపాదమస్తకము భస్మం అయ్యేలా చూస్తున్నారు. మాటలూ వ్యంగ్యంగా వినిపిస్తున్నాయి. దుర్గ నా వేపు అప్పుడప్పుడు పరిశీలనగా చూస్తూంది. రవి అమాయకంగా మా ఇల్లంతా చూస్తున్నాడు.

'ఆఫీసుకు వెళ్ళారు. సాయంత్రం అయిదున్నరకి వస్తారు. ఇంతకీ మీ రెవరో చెప్పారు కారు?'

దుర్గ పేలవంగా నవ్వి, 'హుఁ! ఎవరని చెప్పుకోమంటారు? అన్నివిధాలా అన్యాయమయినవాళ్ళం!' అంది నిస్పృహగా. అప్పటికి ఆమె కళ్ళలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి.

'క్షమించండి! మీ మాటలు నా కర్థం కావడంలేదు.'

ఛ్రుమన్నారు గోపాలయ్యగారు.

'ఎలా అర్థం అవుతాయి నీకు? కండకావరంతో సాటి ఆడదాని కాపురాన్ని కూల్చడమయితే అర్థమవుతుంది! చూడు, ఒక్కసారి నా కూతురు ముఖం చూడు! ఇది నీ కేం

అన్యాయం చేసింది? ఆ బిడ్డ రవిని చూడు! వాడు నీ కేం ద్రోహం చేశాడు?'

అయోమయంగా చూశాను.

'అలా చూస్తావేమమ్మా! చంద్రశేఖరం నా అల్లుడు. మేనల్లుడు కూడా! తల్లి, తండ్రి పోయారని దగ్గిర వుంచుకుని పెంచి పెద్దవాణ్ణి చేశాను. నా దుర్గనిచ్చి పెళ్ళి చేశాను. శాస్త్ర సమ్మతంగా, అగ్ని సాక్షిగా జరిగిందా పెళ్ళి! ఇదుగో శుభలేఖ? చూడు కావాలంటే!'

నా కళ్ళముందున్న శుభలేఖలో పెద్ద పెద్ద అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'వరుడు చిరంజీవి చంద్ర శేఖర్. వధువు సౌభాగ్యవతి దుర్గాదేవి!'

కాళ్ళకింది భూమే కదులుతూందో, నేనే కదలిపోతు న్నానో అర్థం కావడం లేదు! ఇది నిజమా? భ్రమా?

'రెండు సంవత్సరాలకే వీడు పుట్టాడు. అంతే, కొద్ది కొద్దిగ చెడు సహవాసాలు అలవరచుకున్నాడు. అమ్మాయి మందలిస్తే "నీ లెక్కేమిటి" అనేవాడుట! అందుకే నేను కలగజేసుకున్నాను. దానితో అక్కడ ఉద్యోగానికి రాజీ నామా యిచ్చి, గుంటూరులో ఉద్యోగం చెయ్యటానికి వచ్చే శాడుట

'ఎన్నోసార్లు జాబులు వ్రాశాను. జవాబు లేదు! తీరా గుంటూరు వచ్చి వాకబు చేస్తే అలహాబాదులో ఉన్నా డని తెలిసింది.....కాని, నిన్ను వివాహం చేసుకున్నాడని మాకు తెలియదు."

'దుర్గగారూ? యిదంతా నిజంగానే జరిగిందా?' దాదాపు పిచ్చిదానిలా కేక పెట్టాను.

'ఇంకా మీరు నమ్మకపోతే, నేనేం చెయ్యను చెప్పండి? వారెలాంటివారేనా కానీండి—నా భర్త కదా? నా కాపురం నేనే చక్కబెట్టుకోవాలని వెతుక్కుంటూ వచ్చాను! కానీ, ఇక్కడ కూడా...

దుర్గ ఇక మాట్లాడలేక భోరున యేడ్చింది.

తల్లి యేడుస్తూంటే రవి అమాయికంగా భయంగా చూస్తూ ఉండిపోయాడు. ఆపిల్లవాడి వేపు పరిశీలనగా చూశాను. అవును! వారి పోలికే! ముమ్మూర్తులా వారే! నా బాబులో కూడా ఈ పోలికలే ఉన్నాయి!

'అలా బేల అవుతావెందుకమ్మా? నీకు నేనున్నాను! మొదటి భార్య జీవించి ఉండగా, వివాహం చేసుకోవడం చట్ట సమ్మతం కాదు! కేసు పెడతాను...ఎలా దారికి రాడో...' గోపాలయ్యగారు తోక తొక్కిన తాచులా మండిపడు తున్నారు.

వెయ్యి పిడుగులు నెత్తిన పడుతున్నట్లుంది. నిలుచున్న చోటే కూలబడిపోయాను.

కళ్ళు తెరిచేసరికి వారు నా ముఖంలోకి ఆత్రంగా చూస్తూ కూర్చుని ఉన్నారు పక్కనే.

నేను కలగన్నాను కాబోలు! పీడకలే అయిఉంటుంది! "ఎలా ఉంది, భవానీ? ఆత్రంగా అడిగారు వారు.

'చూశారా! ఎలాటి కలవచ్చిందో?' నవ్వుతూ లేవబోయి పక్కకు చూచాను. గోపాలయ్యగారు, దుర్గ, రవి నిల్చుని ఉన్నారు.

కలకాదు! వాస్తవమే! కళ్లు తిరిగిపోయాయి!

'ఇది నిజమేనా?' నాశక్తి అంతా కూడగట్టుకుని అడిగాను. హృదయం ఘోషిస్తూంది. అది నిజం కాగూడదు లేదా దుర్గ, వాళ్ళ నాన్నగారు మరెవరో చంద్రశేఖరం అనుకుని వారి దగ్గరికి వచ్చివుంటారు! లేదావాళ్ళేదో చెబితే, నేనేదో విని వుంటాను. వారిప్పుడు పెదవులు కదిల్చి "కాదు. నిజంకాదు!" అంటారు. శరీరమంతా చెవులు చేసుకున్నాను.

'ముందు నువ్వు విశ్రాంతిగా పడుకో!' అన్నారు.

'నేనడిగేది చెప్పండి ముందు! ఈ దుర్గ మీ భార్యా? ఈ రవి మీ బిడ్డా? ఈయన మీ మామగారా? నిజం చెప్పండి!' ఏ అజ్ఞాతశక్తో అరిచింది నాలోంచి.

'అవును!'

ఒక్కొక్క అక్షరం నా తలమీద కొండలాపడి నన్ను తుత్తునియలు చేసివేసింది.

వారం రోజు లెలాగ గడిచాయో నాకు తెలియదు. బాబును నా పక్కలో పడుకోబెట్టడం, పాలు పట్టడం వగైరాలు ఒకొక్కసారి మెదడు గ్రహించేది. అంతలోనే ఏదో మత్తు, ఏదోమగత నన్ను ఆవరించేవి.

ఆ రోజంతా గోపాలయ్యగారు గట్టిగా అరుస్తున్నారు.

'పాపం! అనవసరంగా ఆ అమ్మాయిని తిట్టుకున్నాం! నువ్వు ఇలాటి వాడివని తెలియక, నిన్ను నమ్ముకుని, తన వాళ్ళ

23

వందరిని దూరం చేసుకుని వచ్చింది, పాపం! ఇప్పుడయినా చెప్పు! ఇంకా ఎందరి గొంతులు కోశావు ?'

'నోరు మూసుకో! అస లింతదూరం వెతుక్కుంటూ ఎవరు రమ్మన్నారు మిమ్మల్ని? ఆ చదువుకోని గబ్బిలాయి నా కక్కర్లేదని అప్పుడే చెప్పివచ్చానుగా!' చంద్రశేఖర్ మరింత గట్టిగా అరుస్తున్నాడు.

'అప్రాచ్యుడా! ఆ మాట ముందుగా ఎందుకు చెప్ప లేదు? నా చిట్టితల్లిని అసలు నీ కిచ్చి చేసేవాణ్ణే కాదుగదా? ఒక బిడ్డకూడా పుట్టాక భార్యకు చదువు కావలసి వచ్చిందా?' గోపాలయ్య మరింత రెచ్చిపోయాడు.

'ఎంతయినా అరుచుకోండి! భవాని ఆరోగ్యం నాశనం చేశారు! వెళ్ళండి ఇక్కడినించి!' చంద్రశేఖర్ అరిచాడు.

'వెళతాంరా! వెళతాం! కోర్టుల చుట్టూరా తిప్పి, నిన్ను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించ కుంటే నా పేరు గోపాలయ్య కాదు!'

ఆయన మాట పూర్తి కాకముందే దుర్గ కంఠస్వరం వినిపించింది. 'నాన్నా! వూరుకో! నువ్వు వెళ్ళేట్లయితే వెళ్ళు! నే మాత్రం రాను. కోర్టులు వద్దు! కేసులువద్దు! వారికి నేనంటే యిష్టంలేదు కాబోలు! మరో అమ్మాయిని చేసుకున్నారు! పోనిండి. భవానిని బ్రతిమాలుకుని నే నిక్కడే ఎలాగో కాలం గడుపుతాను...'

దుర్గ యిక చెప్పలేక ఎక్కిళ్ళు పెడుతూంది.

'దాన్ని బ్రతిమాలుకుని, పని జేసే దానిలా పడి వుంటావా? నీ కేం ఖర్మమ్మా! నిజానికి అదే వెళ్ళాలి...'

'నాన్నా! నీకు దణ్ణంపెడతాను. నన్నిలా బ్రతకనీ!'

వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. వారం రోజులుగా నాలో చెలరేగుతున్న సంఘర్షణ ఒక నిర్ణయానికి వచ్చింది. ఒక్కసారిగా వాళ్ళమధ్యకు వెళ్ళాను.

'బాబాయిగారూ! మీ రన్నదే సరయింది! నా కంటే ముందుగా భార్య అయిన దుర్గక్కయ్యే వారిదగ్గిర వుండాలి. ఈ విషయానికి కేసులు, కోర్టులు, తీర్పులు అనవసరం. నేను కలలో కూడా వారు వివాహితులని అనుకోలేదు. వారు నాకు తెలియ జెయ్య లేదు! ఒక అమాయకురాలి జీవితం ధ్వంసం చెయ్యడంలో నాకూ వాటా ఉందని, మీ వల్లే తెలిసింది! జరిగిందేదో జరిగింది. ఇక కోర్టుల్లో తిరగడం ఎందుకు? అక్కయ్యా! నువ్వు నిశ్చింతగా ఉండమ్మా!' అన్నాను ఆవేశంగా.

గోపాలయ్యగారు, దుర్గ, చంద్రశేఖర్ ముగ్గురుని శ్చేష్టులయ్యారు క్షణకాలం.

'భవానీ! ఎందుకలా నన్ను అసహ్యించుకుంటున్నావు? నీ దగ్గిర నిజం దాచిన మాట నిజమే! నాది తప్పే! కానీ నే నేనాడు మనస్ఫూర్తిగా ప్రేమించలేదు! కేవలం మామయ్య బలవంతం వల్లనే పెళ్ళాడాను...' ఇంకా యేదో చెప్పబోయారు.

'...ఎలా అయినా కానీండి! మీ మీద ఆధారపడిన దుర్గ జీవితం నేను ధ్వంసం చెయ్యలేను! శాస్త్ర సమ్మతమయిన వివాహం మది! నేనంటారా? త్వరపడ్డాను! తల్లిదండ్రుల్ని దూరం చేసుకున్నాను! అంతే!'

'ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నావన్న మాట! పిచ్చి పిల్లా! మించిపోయిందేమీ లేదు! చదువు, సంధ్య లేకున్నా దుర్గకు మొండి పట్టుదల మాత్రం ఉంది. అందుకే వాళ్ళ నాన్నతో దెబ్బలాడి ఇక్కడే ఉంటానంటోంది నువ్వొప్పుకున్నావ్! ఉండనీ! నీకూ కాస్త సాయంగా ఉంటుంది... మనిద్దరం హాయిగా...'

నన్ను దగ్గిరికి లాక్కుంటున్న వారి చేతులు విదిలించి కొట్టాను.

'ఎంత సులభంగా అనేస్తున్నారు! సాటి స్త్రీకి ద్రోహం చెయ్యలేను. సంఘంలోనూ, మనస్సాక్షి దగ్గిర కూడా కేవలం చంద్రశేఖర్ ఉంపుడుగత్తెగా మాత్రం జీవించలేను!'

'అయితే ఏం చేస్తావ్? కేసు పెడతావా?' ఆ కంఠ స్వరంలో హేళన ప్రతిధ్వనిస్తోంది.

'హుం, కేసు పెట్టేటట్లయితే, దుర్గ నాన్నగారిని సపోర్టు చేసేదాన్ని గదా? ఎంత చెడ్డా మీరు నా భర్త! నా బిడ్డకి తండ్రి మీరు! మిమ్మల్ని కోర్టుల పాలు చేసేటంత అవివేకురాలిని కాదు.'

'మరి?'

'అది మీ కనవసరం!'

కోపంతో, అవమానంతో వారు వెళ్ళి పడుకున్నారు. నిద్రపట్ట లేదు. ఎనలేని ఆనందం అనుభవించిన ఘట్టాలన్నీ మళ్ళీ మళ్ళీ దృశ్యాలుగా కనిపించి, కలవరం కలిగిస్తున్నాయి. లోపలి గదిలో దుర్గ, గోపాలయ్యగారు ఏదో మెల్లిగా

మాట్లాడుకుంటున్నారు. ఏమిటిక నా మార్గం! బుర్ర వేడెక్కి పోతూంది. అమ్మ. నాన్న; అన్నయ్యల దగ్గిరికే ముఖం పెట్టుకుని వెళ్లేది? తొలిసారి కాన్పుకు కూడా నన్ను పిలుచుకు వెళ్ళనివాళ్లు, ఈ మూడు సంవత్సరాలలోనూ ఒక్క కార్డు ముక్క కూడా వ్రాయని వాళ్ళు, నన్నాదరిస్తారా ఈ స్థితిలో? అసలే వర్ణ సంకర మయిందని బాధ పడుతున్నవాళ్లు నా బాబును దగ్గిరికి తీస్తారా? ఇక్కడ ఉంటే? ఎలాగూ, వారు దుర్గను ప్రేమించరు! కానీ నా మీద వున్న వ్యామోహము వల్ల అస్తమానం నా చుట్టూరానే వారు తిరుగుతుంటే దుర్గ భరించగలదా? ఒక ఒరలో రెండు కత్తులు ఇమడటం అసంభవం!

ఏం చెయ్యాలి? చచ్చిపోతేనో? అవును! అదే పరిష్కార మార్గం! తీవ్ర నిశ్చయం తీసుకున్నాను. ఎలకలువిపరీతంగా ఉంటే, వాటిని చంపుదామని వారం రోజుల క్రితం ఎలకలమందు తెచ్చి ఉంచారు వారు ఎదురుగా కనిపిస్తూందా విషం గబగబా లేచి వెళ్ళాను. సీసా తీసుకున్నాను.

బాబు కెవ్వుమన్నాడు. నిద్రలో ఉలిక్కిపడ్డాడు

బాబు వేపు చూశాను. భయపడి చుట్టూచూస్తున్నాడు 'అమ్మా!' అని ఏడుస్తున్నాడు! నే చనిపోతే వీడిగతి?

బాబును ప్రసవించడానికి హాస్పిటల్ లో జాయినయినప్పుడు చూశాను! ఒక పసిపాపను తల్లిదండ్రులు హాస్పిటల్ లో పారవేసి వెళ్ళారు! తండ్రికి పనికిరాని బిడ్డ! తల్లికి బరువయినబిడ్డ

ప్రతి నర్సూ, ప్రతి ఆయా కొట్టేది. తిట్టేది. ప్రతి డాక్టరూ చీదరించుకునేవాడు. చీడపురుగులా చూచేవారు.

అందరి ఈ సడింపులతో, దెబ్బలతో, ఆ పాప హృదయ విదారకంగా ఏడుస్తూంటే హృదయం తరుక్కుపోయేది.

నా బాబు మాత్రం ? వాడికి అదే గతి పట్టదూ ? నేను లేకపోతే, తనకు, తన బిడ్డకు, అడ్డుగా నిలిచి, తన భర్తను నా వేపు ఆకర్షించుకొన్నాననే కోపం దుర్గ అంతరాంతరాల్లో ఉండక మానదు. ఎంతయినా స్త్రీ! అసూయా ద్వేషాలు సహజంగానే ఉంటాయి! ఇక నా బాబును ఆవిడ దగ్గిరికి తీస్తుందా? పరిస్థితుల ప్రాబల్యంతో నేను చనిపోవడంతో, తప్పనిసరిగా వారు దుర్గను, రవిని దగ్గిరికి తీసుకుంటారు. బాబు గతి అధోగతే! అమ్మయ్యో! వద్దు! నా బాబు దిక్కులేని వాడు కాగూడదు!

బాబును హృదయానికి హత్తుకున్నాను.

'బాబూ! నేనేమీ తప్పు చెయ్యలేదు! ప్రేమించాను. పెళ్ళాడాను. నిన్ను కన్నాను. వంచింపబడ్డాను. కాని, నువ్వు ధర్మబద్ధంగా జన్మించావు. నాలో ఏలాటి కల్మషము లేదు. ఇక ఎందుకు చావాలి ? నిన్ను పెంచుతాను. నీకోసం బతుకుతాను. నిన్ను అనాథను చెయ్యను!' కళ్ళు వర్షించాయి.

అంతే. ఒక నిర్ణయానికి వచ్చాను.

దుర్గతో చెప్పాను మర్నాడు ; 'అక్కయ్యా! ఇక నేను, బాబు మీకు కనిపించం! నిశ్చింతగా ఉండండి!'

దుర్గ కళ్ళలో అన్ని భావాలనుమించి కృతజ్ఞత ఎక్కువగా కనిపించింది నాకు. వారి దగ్గిరికి వెళ్ళాను.

'సఖ్యం సాప్తపదీనం అంటారు. ఎంత కాదన్నా మనిద్దరం భార్యాభర్తలమే. బాబుకు మీరు తండ్రే. నన్నెంతగానో ప్రేమించారు. లాలించారు. మురిపించారు. ఒక్కటి కోరుకుంటాను. కాదనకండి!' ఇక మాటలు పెగల్లేదు.

'ఏమిటి?' సిర్లిప్తంగా అడిగారు వారు.

'దుర్గని, రవిని బాగా చూచుకోండి! ఆవిడ చదువు రానిదని మీరే చెప్పారు. అమాయికురాలు. ఈ పరిస్థితిలో మీరు త్యజిస్తే, తన కే మార్గము లేదు.

వారు మెల్లిగా నవ్వారు.

పిచ్చిదానా! మరి నీకో?' ఆ ప్రశ్నలో సవాలు ధ్వనిస్తూంది.

'పిచ్చిదాన్నే! కాదనను. నాన్న, అన్నయ్య, అమ్మ ఇంతమంది బాధ్యతాయుతులైన పెద్దలుండగా, నా పెళ్ళి నేనే నిర్ణయించుకోవడంలో చాలా పొరపాటు చేశాను. ప్రేమించి పెళ్ళి చేసుకున్న అందరి జీవితాలూ ఇలా అవుతాయని కాదు. ఇది నా ఖర్మ.'

'భేష్! వేదాంతంలో పడ్డావన్నమాట! భవానీ, నా మాట విను. ఎక్కడికి వెడతావ్?' వారు మళ్ళీ నన్ను సమాధానపరచాలని ప్రయత్నించారు.

'మన అమ్మ, అమ్మమ్మల కాలంలో నయితే మీరు చెప్పినట్లు ఎక్కడికి వెళ్లేమార్గమే వుండేదికాదు గానీ, ఈ

రోజుల్లో నాలాంటి అభాగినులకు మార్గాలెన్నో ఉన్నాయి బ్రతకడానికి ... సరే, నేను వెళుతున్నా, దయచేసి నా దగ్గిరికి, రావడానికి, నన్ను మీదగ్గిరికి రప్పించడానికి ప్రయత్నించ వద్దు ! దుర్గకి, రవికి మాత్రం అన్యాయం చెయ్యకండి...'

అదే స్థితో నే వర్ణించలేను. ఆవేదన, బాధ, విరక్తి, నిస్పృహ అన్నీ కలిసిన నాలో గాఢ నిర్లిప్తత ఆవరించింది.

అదృష్టవశాత్తు కలకత్తాలో ఫాన్సీ షాపులో సేల్స గర్ల్‌గా ఉద్యోగం సంపాదించాను. నాకు, బాబు పోషణకు బ్రతకడానికి డబ్బు సరిపోతూంది. ప్రైవేట్‌గా కొన్ని పరీక్షలకు రాత్రిళ్లు చదువుతున్నాను.

భారతీ, ఇప్పుడు చెప్పు! ఆత్మవిశ్వాసంతో గుండెనిబ్బరంతో అడుగు వేశాను. కాని, నే వేసిన అడుగులు, నన్ను వక్రమార్గానికి లాగాయి, ఎందుకని ? ఏమో !

ఏమయితేనేం ? నా బాబును నేను పెంచుకుంటాను, వాడికోసమే బతుకుతాను. అర్థంలేకుండా జీవితాన్ని అంతం చేసుకోవడం అవివేకం.

భారతీ! మీవారలాగే ఉన్నారని వ్రాశావు విమల బోధలు, నీ సమాధానాలు చదివాను. చాలా బాగా చెప్పావు. విమలలాటి స్త్రీలు ఎందరో ఉన్నారు.

ముఖస్తుతి అనుకోకు. నీలాటి ఉత్తమ గృహిణులు ఇంకా కొందరు ఉండబట్టే ప్రపంచంలో కొంతయినా ధర్మమనేది మిగిలి ఉంది. కల్యాణిని గురించిన వివరాలేవీ నాకు

తెలియవు. కాని, ఒకే మనసుగా, మాటగా మెలిగిన మన ముగురి జీవిత మార్గాలు మూడు తోవలలో సాగాయి. ఎందు చేతనో గాని, మన ముగ్గురి జీవితాలు వక్రరేఖలుగానే సాగి పోతున్నాయి. ఇకమీదట ఈ కొత్త అడ్రస్ కే జాబులు వ్రాస్తుంటావు కదూ?

నీ

'భవాని'

*          *          *

"ఎవరి దగ్గరనుంచి, భారతీ, ఈ ఉత్తరం?" ఆనంద్ ఆప్యాయంగా అడిగాడు.

"భవాని దగ్గిరనుంచి......చదువుకోండి."

అరగంట తర్వాత ఆనంద్ మెడ ప్రక్కకు తిప్పి చూశాడు. సోఫాలో మౌనంగా కూర్చుని ఉంది భారతి.

"భారతీ! ఇలా రా!"

భారతి మెల్లిగా భర్త దగ్గిరికి వచ్చింది.

"పాపం! భవాని బతుకిలా అయిందా? కనీసం నిన్ను ఓదార్చటానికి దగ్గిరికి నడిచిరాలేని స్థితిలో ఉన్నాను..." ఆనంద్ నిస్సహాయంగా అన్నాడు.

"మీ హృదయం ఎప్పుడో నా దగ్గరికి వచ్చివేసింది!"

"భారతీ!"

ఆనంద్ కంఠస్వరం అనురాగపూరిత మయింది. అతడి బాహువుల్లో, ఆ మధురస్పర్శలో విశ్వమే మరిచిపోయింది

భారతి. కల్యాణిని గురించిన ఆలోచనలీలగా మాత్రం మదిలో మెదిలిందామెకు.

"డియర్ కల్యాణీ!

చివరిసారిగా నీకీ ఉత్తరం వ్రాస్తున్నాను, ఓపిగ్గా చదువుకో. భార్యాభర్తల అనుబంధాన్ని గురించి నేననేక మార్లు నీకు చెప్పాను. విద్యావంతురాలివి, వివేకం కలదానివి అయిన నీకు ఆ సంబంధాన్ని గురించి మరీమరీ చెప్పనక్కర్లేదు. కాని, ఏ బంధమయిన తెగినవరకు లాగితే మళ్ళీ అతకదు.

మా మీనాక్షి భర్త శ్యాం చనిపోయాడని వ్రాశాను. ఈ ఇంటికి పెద్దకోడలుగా, నా భార్యగా నీవు, మన కుటుంబానికి వచ్చిన ఈ కష్టంలో పాలుపంచుకుంటావనీ, దుఃఖ భారంతో దిక్కు తెలియని మీనాక్షిని, మనోవేదనతో మంచం పట్టిన మా అమ్మను, ఇవన్నీ భరించవలసిన గృహస్థును నన్ను నీ చల్లటి వాక్కులతో ఓదారడిస్తావనీ తలిచాను. కానీ, నువ్వు రాలేదు. నీకేమీ సంబంధం లేనట్లు ఊరుకున్నావు.

ప్రభాకర్ పెళ్ళి నిశ్చయం కాగానే నీకు వ్రాశాను. కనీసం ఈ శుభకార్యంలోనైనా పాల్గొంటావని ఆశించాను. అదీ లేదు. నీ పట్టుదలే నీదిగా అక్కడే ఉండిపోయావు.

అమ్మ చనిపోతూందని వ్రాశాను. దానికి కూడా జవాబు లేదు.

కల్యాణీ! అమ్మ చనిపోయింది! మీనాక్షి కాపరం అలాగ ధ్వంసమై పోయిందనే దుఃఖమే కాక, నా సంసారం ఇలా తగులడిందన్న ఆ వేదన చివరి క్షణంవరకు ఆమెను బాధిం

చింది. కనీసం చివరి క్షణాల్లోనయినా, నన్ను, నిన్ను చూద్దామనుకుంది. ఆ కోరిక కూడా ఫలించలేదామెకు.

మీనాక్షి ట్రెయినింగ్ పూర్తి చేసింది. ఇక్కడే ఎలిమెంటరీ స్కూల్లో టీచర్ గా పనిచేస్తూంది. ప్రభాకర్ కు పెళ్లి అయింది. వాడు, వాడిభార్య చిలకాగోరింకల్లా హాయిగా ఉన్నారు. ఇక నేను మిగిలిపోయాను, ఏకాకిగా! ఆఫీసుకు వెడితే హేళన!

'అదుగో! మన శ్రీరామచంద్రుడు!' అనేవాడు కోక్లర్క్ వెంకటేశం.

'శ్రీరామచంద్రుడు సీతమ్మను అడివిలో దిగవిడిస్తే ఇతగాడి భార్యే ఇతణ్ణి సిటీలో ఒంటరిగా పారేసి చక్కాపోయింది!' అని నవ్వేవాడు రామం.

'కాకున్నా ఆ మాత్రం భార్యని అదుపులో పెట్టుకోలేని చవట, మగవాణ్ణి అని తిరగడం ఎందుకో? శుభ్రంగా చీరె కట్టుకొని ఇంట్లో కూర్చోక!' శ్రీనివాసరావు విమర్శ.

'చాల్లేవోయ్! మనమంతా ఏ మాత్రం భార్యల్ని అదుపులో పెడుతున్నాం?' చలపతిరావు సానుభూతి.

'నువ్వు ఎన్ని అయినా చెప్పు! సుధాకర్ కాబట్టి సహించాడు గాని నేనైతే చంపి పాతేద్దును!' కృష్ణారావు ఉవాచ.

ఇలాటి వాగ్బాణాలవల్ల సంఘంలో నా పరువుప్రతిష్ఠలను గురించిన స్పష్టరూపం తెలిసిపోయింది.

ఇంట్లో ఒంటరితనం.

'చూడు సుధాకర్! జరిగినదేదో జరిగిపోయింది! ఆవిడ కంత పంతమయితే, నీకేనా లేంది! శుభ్రంగా విడాకులిచ్చి మరో అమ్మాయిని చేసుకో!' అన్నాడు పక్కింటి కామేశం.

'నా అభిప్రాయంలో ఒక ఆడదానికి ఒక్కడే భర్త! అల్లాగే ఒక్క పురుషుడికి ఒక్కర్తే భార్య!' అన్నాను.

'నీ యిష్టం' అనేశాడతడు.

కల్యాణీ! నాకు తెలుసు నీ పంతం, నీకోసం నేను వెర్రెత్తిపోతాననీ నీకు తెలుసు. నువ్వే నా సర్వస్వమనీ నీకు తెలుసు. నేను మృదుహృదయుడననీ నీకు తెలుసు. ఇన్ని తెలిసినా నీ పట్టుదల వదలకపోవడానికి కారణం ఒక్కటే. మీనాక్షికి ఉద్యోగం వచ్చింది. అది వెళ్ళిపోయింది. ప్రభాకర్ కు పెళ్ళి అయిపోయింది. అమ్మ చనిపోయింది. ఇక ఒంటరిగా మిగిలిన నేను, నా అంతగా వచ్చి నిన్ను పిలుచుకు వెళ్ళాలి. అదే నీ కోర్కె! నీ ఆశయం! అవునా? నా ప్రతి జాబుకు నువ్వు జవాబు వ్రాయకపోవటానికి కారణమదే. కాదనకు. ఒక్కొక్క మెట్టు దిగి నీ దగ్గరికి నేను వచ్చినకొద్దీ! నువ్వు ఒక్కొక్క అంతస్తే పైకి ఎక్కావు. అందుకే మనిద్దరి మధ్య చాలా దూరం ఏర్పడింది.

ఇప్పుడు నీవు వచ్చినా, నేడు స్వీకరించే స్థితిలో లేను. కారణం నీ ప్రవర్తనతో నా హృదయం వయ్యారైపోయింది. క్షమా గుణము, సహనము ఇగిరిపోయాయి. నా ఆవేదనలో, దుఃఖంలో బాధలో నాకు శాంతి ఇవ్వలేని నువ్వు, నాకిప్పుడు

అవసరంలేదు కేవలం భర్తతో సుఖాన్ని అనుభవించడానికే భార్య సంసిద్ధురాలయితే, అలాటి భార్య, అంటే నువ్వు నా కవసరంలేదు.

అన్ని బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాను. అన్ని మమతానుబంధాలూ విసర్జించాను. విరక్తితో, నిస్పృహతో వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో నాకే తెలియదు.

కానీ ఒక్కటి మాత్రం చెబుతున్నాను గుర్తుంచుకో!

జీవితం చాలా విచిత్రమయినది. అందులో స్త్రీ జీవితం చాలా క్లిష్టమైనది. అన్ని విధాలా అనుకూలుడయిన భర్త సంసారం లభించడమే దుర్లభం. లభించినా వారి జీవితం సాఫీగా, చక్కటి పూలబాటలో సాగిపోవడమూ అరుదే.

కాని, అన్నీ లభించినా, అర్థంలేని పట్టుదలలతో అసహనంతో, జీవితాన్ని వక్రమార్గాలలో సాగించే నీలాటి అవివేకులు కూడా కొందరున్నారు స్త్రీలలో. ఒకప్పుడు మీ స్నేహితురాళ్ళయిన భారతి, భవానులను గురించి చెప్పావు, వారిద్దరి వైవాహిక జీవితాలను గురించిన ఉత్తరాలూ చూపావు. ఈ మధ్య వారిద్దరి జీవితాలు ఎలాగ మలుపు తిరిగింది నా స్నేహితులు కొందరు, అక్కడివాళ్ళు చెప్పగా విన్నాను.

పరిస్థితుల ప్రాబల్యంలో వక్రగతిని పట్టినా, వాళ్లిద్దరు తమ ఆత్మవిశ్వాసంతో, వివేకంతో, బతుకులు చాలావరకు సక్రమ మార్గాలలోకి మళ్లించుకున్నారు.

నీవు అలాగ కాదు. అన్నివిధాల అందివచ్చిన అవకాశాలను దుర్వినియోగం చేసుకున్న నీ జీవితం ఇక ఆ వక్రమార్గంలోనే సాగక తప్పదు. ఎక్కడున్నా నువ్వు సుఖంగా ఉండటమే కాంక్షిస్తాను. అదే నా బలహీనత... వెళ్తున్నా,

సుధాకర్"

పట్టుదలతో, అవివేకంతో, బలవంతంగా తనను తాను హింసించుకుని, అస్థిపంజరంలా ఉన్న కల్యాణి. ఒక్కసారిగా వెనక్కి విరుచుకు పడిపోయింది! ఆమె చేతిలోని ఉత్తరం గాలిలో వంకరటింకరగా ఎగిరిపోయింది!